సంపుటి : 18
సంచిక : 132
Vol : 18
Issue : 132

RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

# పీపుల్స్ డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

వరంగల్, ఆదివారం 19 జూలై 2026
Warangal, Sunday 19 July 2026

పేజీలు : 08
వెల రూ : 4-00

Pages : 08
Price : 4-00



WANTED
పీపుల్స్‌డైరీ
దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సెంటర్లు
◆ హనుమకొండ ◆ కరీంనగర్
◆ భూపాలపల్లి ◆ పెద్దపల్లి/రామగుండం
◆ జనగామ ◆ మహబూబాబాద్
◆ హైదరాబాద్ ◆ నిజామాబాద్
Cell : 9493019044
9618509859

# పడిపోయిన అమ్మకాలు




పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : కొత్త స్మార్ట్‌ఫోన్ కొనాలనుకుంటున్నారా? అయితే ఈ షాకింగ్ న్యూస్ మీ కోసమే. గడిచిన ఆరేళ్లలో ఎన్నడూ లేని విధంగా దేశీయ స్మార్ట్ ఫోన్ మార్కెట్ జూన్ క్వార్టర్‌లో (క్యూ2) ఏకంగా 10 శాతం క్షీణత నమోదు చేసింది. ఏఐ డిమాండ్ కారణంగా విడిభాగాల ఖర్చులు పెరగడంతో మొబైల్ కంపెనీలు ధరల్ని భారీగా పెంచడమే ఇందుకు కారణం. ఈ మార్కెట్ సంక్షోభంలోనూ వివో మాత్రం తన అగ్రస్థానాన్ని కాపాడుకుంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ( స్పాన్సర్‌షిప్ క్రేజ్‌తో నథింగ్ బ్రాండ్ ఊహించని రీతిలో వృద్ధి సాధించింది. క్యూ2 త్రైమాసికంలో వివో మార్కెట్ వాటా 18 శాతంగా ఉంది. ఇదే మార్కెట్ లీడర్‌గా ఉంది. ప్రీమియం సెగ్మెంట్ (వీ70 సిరీస్) బాగున్నా, బడ్జెట్ ఫోన్ల ధరల పెంపుతో ఒత్తిడి ఎదుర్కొంది. శాంసంగ్ మార్కెట్ వాటా 17.6 శాతంగా ఉంది. అయినప్పటికీ ఇది 2 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేసిన ఏకైక బ్రాండ్.

(మిగతా 2లో...)

- సంక్షోభంలో స్మార్ట్‌ఫోన్ బిజినెస్
- భారీగా పెరిగిన ధరలే కారణం
- సగటున 15 శాతం ధరల పెరుగుదల



# తీవ్ర విషాదం



- గోదావరిలో చేపల వేటకు వెళ్లి ఐదుగురు మృతి..
- పోలవరం జిల్లాలో ఘటన
- మృతుల్లో ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు

పీపుల్స్‌డైరీ–క్రైం బ్యూరో : పోలవరం జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లి ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. పోలవరం జిల్లాలోని ఎటపాక మండలం గొల్లగూడెం వద్ద ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. చేపల కోసమని గోదావరి నదిలోకి దిగిన ఐదుగురు.. నీటిలో మునిగి గల్లంతయ్యారు. నదిలో లోతు ఎక్కువగా ఉండటంతో నీట మునిగి ఊపిరాడక మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు, సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే అప్పటికే వారంతా ప్రాణాలు కోల్పోయారు. సహాయక చర్యలు చేప ట్టిన పోలీసులు ఐదు మృతదేహాలను వెలికి తీశా రు. మృతులలో ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు ఉన్నారు. వీరంతా గొమ్ముకొత్తగూడెం గ్రామానికి చెందిన వారిగా పోలీసులు గుర్తిం చారు. ఒకేరోజు అనుకోని రీతిలో ఐదు గురు ప్రాణాలు కోల్పోవటంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకు న్నాయి. వారి కుటుంబసభ్యులు గుండెల విసేలా రోదిస్తున్నారు. ఈ ఘటనపై పోలీ సులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

- అప్పులు ఇచ్చి, ఆస్తులు కాజేయడంలో దిట్ట
- నమ్మి వస్తే... చివరకు చిప్ప చేతికి ఇస్తుంది..
- పెట్టుబడుల పేరుతో ఘరానా మోసాలు
- ఆపదలో ఉండి, అత్యవసరంగా డబ్బులు కావాలని వెళ్తే ఖతమే!
- స్పష్టమైన వ్యూహాలతో దూకుడు
- ఎదురుతిరుగుతే కిరాయి మనుషులతో దాడులు!
- ఇప్పటికే రోడ్డున పడ్డ అనేక కుటుంబాలు
- ఫిర్యాదులు అందినా పట్టించుకోని పోలీసులు?

# 'పేట' గడ్డపై కిలేడీ డాన్

రెక్కలు ముక్కలు చేసుకుని పైసా పైసా కూడబెట్టి జీవితాన్ని నిలబెట్టుకునే వారు కొందరైతే.... మాటలతో మాయలు చేసి, అవసరాన్ని ఆసరా చేసుకుని చేసుకుని, వడ్డీ వ్యాపారం. పెట్టుబడుల పేరిట అమాయకుల ఆస్తులే కొట్టేసేవారు మరికొందరు. ఇక ఈ వడ్డీ వ్యాపారానికి రౌడీయిజం కూడా తోడైతే ఇంకేమైనా ఉందా? చట్టాన్ని, పోలీసులను మేనేజ్ చేయగల సత్తా, పెద్దలతో పరిచయాలు ఉంటే ఇంకా అదనపు బలం ఉన్నట్టే... అయితే ఇలాంటి వ్యవహారాలు మామూలుగా కండలు తిరిగిన మగవాళ్లే చేస్తారనుకేంటే పొరపాటే. నర్సంపేట పట్టణంలో ఒక మహిళ కొమ్ములు తిరిగిన రౌడీలా ఇదంతా చేస్తూ హాట్ టాపిక్‌గా మారింది. పైన పేర్కొన్న క్వాలిటీస్ అన్ని ఆమెలో మెండుగా ఉండగా, ఇప్పటికే ఎందరినో రోడ్డున పడేసింది.

– పీపుల్స్‌డైరీ, నర్సంపేట

2వ పేజీలో..




# నా దారి.. రహదారి...

## కేబీఆర్ పార్కులో 20 అడుగుల పైథాన్..

### పామును చూసి ఉలిక్కిపడ్డ వాకర్స్!



**పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ :** హైదరాబాద్ నగర నడిబొడ్డున శనివారం ఉదయం భారీ కొండచిలువ ప్రత్యక్షమైంది. బంజారాహిల్స్ ఉన్న కాసు బ్రహ్మానంద రెడ్డి (కేబీఆర్) జాతీయ పార్కులో వాకర్స్ కంట పడ్డ పైథాన్ ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురిచేసింది. ఉదయపు వాకింగ్‌కు వచ్చిన వారు సుమారు 20 అడుగుల పొడవున్న పైథాన్ పార్కులోని నడక మార్గాన్ని నెమ్మదిగా దాటుతుండటం చూసి కొద్దిసేపు భయాందోళనకు గురయ్యారు. కొండచిలువ భారీ పరిమాణం కారణంగా దారిని పూర్తిగా (మిగతా 2లో...)

# స'ధర'ం

## దివ్యాంగులనూ వదలట్లే



- వరంగల్ ఎంజీఎంలో సదరం సర్టిఫికెట్ల జారీలో గోల్‌మాల్?
- డబ్బులు చెల్లించినవారికి గంటల్లోనే సర్టిఫికెట్లు
- నిజమైన వైకల్యం ఉన్నవారు కాళ్లరిగేలా తరగాల్సిందే
- వాస్తవ బాధితులకు తీరని అన్యాయం
- ఉన్నతాధికారులు చర్యలు దృష్టిసారించాలి...

పీపుల్స్‌డైరీ–వరంగల్ : సమాజంలో అత్యంత బలహీన వర్గమైన దివ్యాంగులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల ద్వారానే జీవనాధారం లభిస్తోంది. అలాంటి వారికి అవసరమైన దివ్యాంగుల (సదరం) సర్టిఫికెట్ల జారీ ప్రక్రియలోనే అక్రమాలు చోటుచేసుకుంటున్నాయనే ఆరోపణలు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిపై తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. డబ్బులు చెల్లించిన వారికి గంటల వ్యవధిలోనే సర్టిఫికెట్లు అందుతుండగా, నిజమైన అంగవైకల్యం ఉన్న వారు మాత్రం కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అవస్థలు పడుతున్నారని బాధితులు వాపోతున్నారు.

**రూ.20 వేల వరకు వసూళ్లు?**

విశ్వసనీయ సమాచారం మేరకు, దివ్యాంగుల సర్టిఫికెట్ కోసం

(మిగతా 2లో...)












- కమలం కీలక వ్యూహం
- మొదట నేతల్లో విభేదాలపై కొరడా
- రానున్న ఎన్నికలే లక్ష్యంగా ఆపరేషన్ తెలంగాణ
- బీజేపీ అలర్ట్ మోడ్ ఆన్...
- కీలక నిర్ణయాలు ఖరారు
- తెలంగాణపై బీజేపీ స్పెషల్ ఫోకస్..
- ఆ ఇద్దరు నేతలకు కీలక సూచనలు

# స్పెషా'ల్ ఫోకస్

2వ పేజీలో..

# 'పేట' గడ్డపై కి'లేడీ' డాన్!

- అప్పులు ఇచ్చి, ఆస్తులు కాజేయడంలో దిట్ట
- నమ్మి వస్తే... చివరకు చిప్ప చేతికి ఇస్తుంది..
- పెట్టుబడుల పేరుతో ఘరానా మోసాలు
- ఆపదలో ఉండి, అత్యవసరంగా డబ్బులు కావాలని వెళ్తే ఖతమే!
- స్పష్టమైన వ్యూహాలతో దూకుడు
- ఎదురుతిరుగుతే కిరాయి మనుషులతో దాడులు!
- ఇప్పటికే రోడ్డున పడ్డ అనేక కుటుంబాలు
- ఫిర్యాదులు అందినా పట్టించుకోని పోలీసులు?

పీపుల్స్‌డైరీ-నర్సంపేట

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నర్సంపేట పట్టణంలో ఓ కి'లేడీ' తక్కువ వడ్డీకే అప్పు ఇస్తానంటూ నమ్మించి, కోట్లాది రూపాయల విలువైన ఆస్తులను గుంజుకుంటూ ఎందరో అమాయక ప్రజలను రోడ్డున పడేస్తోంది. ఈ కేటుగాత్తె వ్యూహం చాలా స్పష్టంగా ఉంటుంది. పట్టణానికి సమీపంలో ఉండి, మంచి డిమాండ్ ఉన్న ఇళ్లు, ఖాళీ స్థలాలను ఈమె టార్గెట్ చేస్తుంది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉండి, అత్యవసరంగా డబ్బులు అవసరమైన అమాయక ప్రజలను గుర్తించి వారికి వల వేస్తుంది.

"మీ ఇల్లు లేదా భూమి పేపర్లు నా దగ్గర పెట్టండి. బ్యాంకు వడ్డీ రేటుకే మీకు డబ్బులు ఇస్తాను. మీ దగ్గర డబ్బులు ఉన్నప్పుడు తిరిగి ఇచ్చేసి మీ డాక్యుమెంట్లు పట్టుకెళ్లండి" అంటూ నమ్మబలుకుతుంది. ఆమె మాటలు నమ్మి వెళ్లడమే ఆ బాధితులు చేసిన పాపమైంది.

**రూ. 80 లక్షల ఇల్లు.. కేవలం రూ. 10 లక్షలకే స్వాహా! ఇలా ఎన్నో**

ఈమె మోసాల తీరు చూస్తే ఎవరైనా నోరెళ్లబెట్టాల్సిందే. మార్కెట్‌లో రూ. 80 లక్షల పైనే విలువ చేసే ఒక ఇంటిని చూపిస్తే... దానికి కేవలం రూ. 10 లక్షలు మాత్రమే చేతిలో పెడుతుంది. సెక్యూరిటీ పేరుతో ఒరిజినల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను తన దగ్గర ఉంచుకుంటుంది. ఆ తర్వాత అసలు కథ మొదలవుతుంది.

**ఫోర్జరీ సంతకాలు:**

బాధితులకు తెలియకుండానే డాక్యుమెంట్లపై ఫోర్జరీ సంతకాలు చేసి, ఆ ఆస్తులను తన పేరిట మార్చేసుకుంటుంది. రౌడీయిజం, బెదిరింపుల్లో సైతం ఆరితేనట్టు విమర్శలున్నాయి. ఆస్తి తన పేరిట మారిన వెంటనే రంగు మారుస్తుంది. "ఈ ఇల్లు నాది.. ఈ భూమి నాది.. వెంటనే ఖాళీ చేయండి" అంటూ యజమానుల పైనే తిరగబడుతుంది.



తాము మోసపోయామని గ్రహించి బాధితులు ఎదురుతిరిగితే, కిరాయి గూండాలను రంగంలోకి దించుతుంది. బాధితులను ఇళ్లలోంచి బలవంతంగా, దౌర్జన్యంగా బయటకు గెంటేస్తోంది. ఇలా ఒక్కరు కాదు ఇద్దరు కాదు నర్సంపేటలో బాధితులు పదుల సంఖ్యలో ఉన్నారనే టాక్ వినిపిస్తుంది.

**నిమ్మకు నీరెత్తినట్లుగా పోలీసుల వ్యవహారం!**

ఈ లేడీ కిలాడీ చేతిలో మోసపోయిన బాధితులు ఎందరో ఉన్నారు. సర్వస్వం కోల్పోయి, న్యాయం చేయాలంటూ పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయింది. ఇదంతా చూస్తున్న స్థానిక పోలీస్ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఆమెకున్న రాజకీయ పలుకుబడి లేదా మరేదైనా కారణంతో పోలీసులు కేసు నమోదు చేయడానికి వెనుకాడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

**బాధితుల ఆవేదన:**

"మేము ఆపదలో ఉండి రూపాయి కోసం వెళ్తే.. మా జీవితకాల కష్టాన్ని దోచుకుంది. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. మాకు న్యాయం జరగకపోతే ప్రాణాలు తీసుకోవడం మినహా మరో మార్గం లేదు." ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ఈ ఘరానా కిలాడీ ఆట కట్టించాలని, బాధితులకు న్యాయం చేయాలని సర్వత్రా డిమాండ్ వ్యక్తమవుతోంది.

# స'ధర'ం

(మొదటి పేజీ తరువాయి)

వచ్చే నిజమైన లబ్ధిదారుల నుంచే చిన్నచిన్న సాకులు చూపుతూ రూ.20 వేల వరకు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. డబ్బులు చెల్లించలేని వారి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచడం, మళ్లీ మళ్లీ రావాలని చెప్పడం, కొత్త కొత్త పత్రాలు అడగడం వంటి చర్యలతో వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలుస్తోంది.

అదే సమయంలో, అంగవైకల్యం లేకపోయినా భారీ మొత్తంలో ముడుపులు చెల్లించిన వారికి మాత్రం నిబంధనలను పక్కనబెట్టి సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారనే ఆరోపణలు మరింత సంచలనం రేపుతున్నాయి. ఈ పరిస్థితి నిజమైన దివ్యాంగుల హక్కులను హరిస్తోందని సామాజిక వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

ఎంజీఎం ఆస్పత్రిలో కొందరు ఉద్యోగులు బ్రోకర్లతో కుమ్మక్కై ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఆస్పత్రికి వచ్చే అమాయక దివ్యాంగులను బ్రోకర్లు ముందుగానే సంప్రదించి, "డబ్బులు ఇస్తేనే పని అవుతుంది" అనే భయాన్ని కలిగించి భారీ మొత్తాలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. దీంతో ప్రభుత్వ సేవలు కూడా మధ్యవర్తుల చేతుల్లో చిక్కుకున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**డీఆర్‌డీఏ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పెత్తనం?**

సదరం సర్టిఫికెట్ల జారీ ప్రక్రియలో డీఆర్‌డీఏకు చెందిన కొందరు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జోక్యం అధికమైందని ఎంజీఎం వర్గాలే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆస్పత్రి పరిధిలో ఉండాల్సిన కొన్ని సేవలు వారి ఆధీనంలోకి వెళ్లడంతో దివ్యాంగులకు సరైన సమాచారం అందడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రత్యేకించి వినికిడి లోపం ఉన్న వారికి అందించాల్సిన వినికిడి యంత్రాల వ్యవహారంలో కూడా గందరగోళం నెలకొన్నట్లు తెలుస్తోంది. ఈ సేవలకు సంబంధించిన సమాచారాన్ని కొందరు తమ వద్దే ఉంచుకుని లబ్ధిదారులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. డీఆర్‌డీఏలో పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగి దివ్యాంగులకు తప్పుడు సమాచారం అందిస్తూ అనవసరంగా తిప్పలు పెడుతోందని ఆస్పత్రి వర్గాల్లో చర్చ జరుగుతున్నట్లు సమాచారం. ఈ కారణంగా సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ మరింత జాప్యం అవుతోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పారదర్శకతకు జిల్లా సమాఖ్యకు అవకాశం ఇవ్వాలన్న డిమాండ్**

ఈ అవినీతి ఆరోపణలకు శాశ్వత పరిష్కారం కోసం సదరం సర్టిఫికెట్ల జారీ ప్రక్రియలో వికలాంగుల జిల్లా సమాఖ్య ప్రతినిధులకు కూడా భాగస్వామ్యం కల్పించాలని దివ్యాంగుల సంఘాలు కోరుతున్నాయి. వారి పర్యవేక్షణ ఉంటే మధ్యవర్తుల ప్రమేయం తగ్గి, నిజమైన అర్హులకు పారదర్శకంగా సర్టిఫికెట్లు అందే అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

# తెలంగాణపై స్పె'షా'ల్ ఫోకస్

- కమలం కీలక వ్యూహం
- మొదట నేతల్లో విభేదాలపై కొరడా
- రానున్న ఎన్నికలే లక్ష్యంగా ఆపరేషన్ తెలంగాణ
- బీజేపీ అలర్ట్ మోడ్ ఆన్...
- కీలక నిర్ణయాలు ఖరారు
- తెలంగాణపై బీజేపీ స్పెషల్ ఫోకస్..
- ఆ ఇద్దరు నేతలకు కీలక సూచనలు

పీపుల్స్‌డైరీ-పొలిటికల్ బ్యూరో : తెలంగాణలో అధికారమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తన రాజకీయ వ్యూహాలను మరింత పదును పెడుతోంది. రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు నాయకుల మధ్య నెలకొన్న విభేదాలకు తెరదించేందుకు అధిష్ఠానం నేరుగా రంగంలోకి దిగినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ కీలక నిర్ణయాలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

ఇటీవలి కాలంలో తెలంగాణ బీజేపీలో అంతర్గత విభేదాలు పార్టీ కార్యకలాపాలపై ప్రభావం చూపుతున్నాయనే అభిప్రాయం హైకమాండ్‌లో వ్యక్తమైనట్లు తెలుస్తోంది. ముఖ్యంగా సీనియర్ నేతల మధ్య సమన్వయం లోపించడం పార్టీ విస్తరణకు అడ్డంకిగా మారుతోందని కేంద్ర నాయకత్వం గుర్తించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) సునీల్ బన్సల్‌తో పాటు అభయ్ పటేల్ హైదరాబాద్‌లో మకాం వేసి రాష్ట్ర నాయకులతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

**బండి-ఈటల విభేదాలపై ప్రత్యేక దృష్టి**

తెలంగాణ బీజేపీలో కొంతకాలంగా కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మధ్య విభేదాలు కొనసాగుతున్నాయనే ప్రచారం రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. ఈ అంశంపై గతంలోనే కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పాటు పలువురు జాతీయ నాయకులు పార్టీ ఐక్యతపై స్పష్టమైన సూచనలు చేసినప్పటికీ పరిస్థితిలో ఆశించిన మార్పు కనిపించలేదని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర నాయకులు ఈటల రాజేందర్ నివాసానికి వెళ్లి రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్లు సమాచారం. ఇదే తరహాలో ఇతర కీలక నేతలతో కూడా ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, వ్యక్తిగత భేదాలను పక్కనబెట్టి సమిష్టిగా పనిచేయాలని స్పష్టమైన సందేశం ఇచ్చినట్లు తెలుస్తోంది.

**దక్షిణాదిపై బీజేపీ వ్యూహం**

దేశవ్యాప్తంగా దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీ బలోపేతంపై బీజేపీ అధిష్ఠానం ప్రత్యేక దృష్టి సారించింది. అందులో తెలంగాణను అత్యంత కీలక రాష్ట్రంగా పరిగణిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్రంలో అధికారానికి ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలంటే ముందుగా పార్టీ అంతర్గత ఐక్యతను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని హైకమాండ్ అంచనా వేస్తున్నట్లు సమాచారం.

**అమిత్ షా ప్రత్యక్ష పర్యవేక్షణ?**

తెలంగాణ రాజకీయ పరిణామాలు, పార్టీ వ్యవహారాలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. రాష్ట్రంలో తీసుకోవాల్సిన కీలక రాజకీయ నిర్ణయాలు, ఎన్నికల వ్యూహాలపై ఆయన నేరుగా మార్గనిర్దేశనం చేస్తున్నారని సమాచారం.

**ముందుగా గ్రేటర్... తర్వాత అసెంబ్లీ**

రాబోయే గ్రేటర్ హైదరాబాద్‌కు సంబంధించిన ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించి, అదే ఊపుతో అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లాలన్న వ్యూహంతో బీజేపీ పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ శ్రేణులను క్షేత్రస్థాయిలో చురుకుగా మార్చడం, నాయకత్వ సమన్వయాన్ని పెంచడం, కొత్త కార్యాచరణ రూపొందించడం వంటి అంశాలపై అధిష్ఠానం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు సమాచారం.

# నకిలీ ధ్రువీకరణ పత్రాలతో భూ బదలాయింపు వ్యవహారం

- దమ్మపేట తహసిల్దార్, పెద్దగొల్లగూడెం జీపీఓ సస్పెన్షన్
- బతికున్న పట్టాదారుడిని మృతుడిగా చూపిన వైనం
- చట్టవిరుద్ధంగా వారసత్వం మంజూరు చేసినట్లు విచారణలో వెల్లడి




**దమ్మపేట, జూలై 18(పీపుల్స్ డైరీ)** : దమ్మపేట మండలం పెద్దగొల్లగూడెం రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నెం. 385/54లో ఉన్న 5.00 ఎకరాల భూమికి సంబంధించిన అక్రమ వారసత్వ బదలాయింపు వ్యవహారం తీవ్ర సంచలనంగా మారింది. నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం, నకిలీ కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం ఆధారంగా చట్టవిరుద్ధంగా పట్టాదార్ పాస్‌పుస్తకం జారీ చేసినట్లు జరిగిన విచారణలో తేలడంతో రెవెన్యూ శాఖ కఠిన చర్యలు చేపట్టింది.

**బతికున్న వ్యక్తిని మృతుడిగా చూపినట్లు ఆరోపణ**

విచారణ నివేదిక ప్రకారం, బతికే ఉన్న అసలు పట్టాదారుడిని మరణించినట్లుగా పరిగణించి, సంబంధం లేని వ్యక్తిని చట్టబద్ధమైన వారసురాలిగా గుర్తించినట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా క్షేత్రస్థాయి విచారణ చేయకుండా, నకిలీ కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలను ఆధారంగా తీసుకుని వారసత్వాన్ని ఆమోదించినట్లు వెల్లడైంది.

**తహసీల్దార్, జీపీఓపై ప్రాథమికంగా ఆరోపణలు రుజువు**

కొత్తగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారి నివేదిక ప్రకారం, దమ్మపేట తహసీల్దార్, పెద్దగొల్లగూడెం గ్రామ పరిపాలన అధికారి ప్రాథమికంగా ఆరోపణలు రుజువైనట్లు పేర్కొన్నారు.

ఈ వ్యవహారంలో అధికారులు అధికార దుర్వినియోగం, విధి నిర్వహణలో నిర్లక్ష్యం, చిత్తశుద్ధి లోపించడం, శాఖ నిబంధనలు మరియు ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘించడం వంటి తీవ్రమైన తప్పిదాలకు పాల్పడినట్లు జిల్లా కలెక్టర్ అభిప్రాయపడ్డారు.

**తహసిల్దార్, గ్రామ పరిపాలన అధికారి సస్పెన్షన్**

జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు తహసిల్దార్‌తో పాటు పెద్దగొల్లగూడెం గ్రామ పరిపాలన అధికారిని తక్షణమే సస్పెన్షన్‌లో ఉంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. శాఖాపరమైన విచారణ పూర్తయ్యే వరకు వారిద్దరు సస్పెన్షన్‌లో కొనసాగుతారు.

# పడిపోయిన అమ్మకాలు...

(మొదటి పేజీ తరువాయి)

గెలాక్సీ ఎ, ఎస్ సిరీస్‌లకు మంచి డిమాండ్ దక్కింది. ఒప్పో మార్కెట్ వాటా 14 శాతంగా ఉంది. రూ. 20 వేలకుపైబడిన సెగ్మెంట్‌లో (ఎ6, కే14 సిరీస్) డబుల్ డిజిట్ గ్రోత్‌తో మూడో స్థానంలో నిలిచింది. షియోమీ (పోకోతో కలిపి) 13 శాతం మార్కెట్ వాటా సాధించింది. బడ్జెట్ మిడ్ రేంజ్ ఫోన్ల ధరలు పెరగడం వల్ల షిప్‌మెంట్స్ తగ్గుముఖం పట్టాయి. రియల్ మీ టాప్- 5 లో చివరిదిగా ఉంది. రూ. 20 వేల లోపు విభాగంలో ధరలు పెరగడంతో అమ్మకాలు క్షీణించాయి.

ఏఐకి డిమాండ్ పెరగడంతో మొబైల్ మెమొరీ విడిభాగాల ధరలు విపరీతంగా పెరిగాయి. దీని వల్ల కంపెనీలు ఫోన్ల ధరల్ని సగటున 15 శాతం మేర పెంచాల్సి వచ్చింది. ధరల పెంపు ప్రభావం సామాన్యులపై పడింది. ముఖ్యంగా రూ. 15 వేల లోపు బడ్జెట్ ఫోన్ల విక్రయాలు 45 శాతం తగ్గాయి. చైనీస్ బ్రాండ్ల మార్కెట్ వాటా 2020 తర్వాత అత్యంత కనిష్ఠ స్థాయికి పడిపోయేందుకు ఇదే ప్రధాన కారణం.

# రంగశాయిపేట భీరన్న బోనాల పండుగకు రండి

## ప్రముఖులకు ఆహ్వానం



**వరంగల్, జులై 18 (పీపుల్స్‌డైరీ) :** వరంగల్ నగరంలో గల రంగసాయిపేట ప్రాంతంలోని కురుమ కులస్తులకు ఇలవేల్పు అయిన శ్రీ భీరన్న బోనాల పండుగ ఈనెల 25 శనివారం రోజున జరిగే బోనాల పండుగకు రావాలని కమిటీ ఆధ్వర్యంలో ప్రముఖులకు ఆహ్వానం పలికారు. మాజీ కార్పొరేటర్ కొంతం తారా మోహన్ కేడల పద్మ జనార్ధన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బోలుగుడ్డ సారయ్య, దామరకొండ కర్ణాకర్, జనతా పరపతి సంఘం అధ్యక్షుడు కెడల మల్లేశం, శాలివాహన కుమ్మరి సంగం ఉపాధ్యక్షుడు అవునురి కుమారస్వామిని తదితరులను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి కురుమ కుల సంఘం కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రాన్ని అందించి ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కురుమ కుల సంఘం అధ్యక్షులు మండల హారీష్, ప్రధాన కార్యదర్శి జినుక రమేష్, గౌరవ అధ్యక్షులు మండల సీతారాములు, మండల రాములు, మండల ప్రభాకర్, మండల నరసింహా రాములు, మండల యాదగిరి, దూడే పరమేష్ తదితరులు పాల్గొని ఆహ్వానించడం జరిగింది.

# విద్యాలయాల్లో వికృత చేష్టలు వద్దు

- ర్యాగింగ్ రహిత సమాజం దిశగా అడుగులు వేద్దాం
- ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.పూజ





**పీపుల్స్‌డైరీ-వరంగల్ :** "ర్యాగింగ్ అనేది విద్యార్థుల జీవితాలను చిన్నాభిన్నం చేసే ఒక సామాజిక భూతం అని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.పూజ పేర్కొన్నారు. భట్టుపల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ నివాస మహిళా డిగ్రీ కళాశాల, వరంగల్ కళాశాలలో వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో "ప్రోహిబిషన్ ఆఫ్ ర్యాగింగ్ యాక్ట్ - 1997" చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా న్యాయమూర్తి కె.పూజ పాల్గొని, మాట్లాడుతూ ర్యాగింగ్ అనేది కేవలం వినోదం కోసం మొదలై, నేడు మానసిక, శారీరక హింసకు మరియు బలవన్మరణాలకు దారితీస్తోందని వాపోయారు. విద్యాసంస్థల్లో సీనియర్ విద్యార్థులు జూనియర్లను భయభ్రాంతులకు గురిచేయడం, అవమానించడం నేరంగా పేర్కొన్నారు. బాధితులు మానసిక ఒత్తిడికి లోనయి, చదువు మధ్యలోనే ఆపేయడం లేదా భయంతో ఆత్మహత్యలకు పాల్పడటం జరుగుతోంది అని వివరించారు. ర్యాగింగ్‌ను తీవ్రమైన నేరంగా పరిగణిస్తూ, ర్యాగింగ్‌కు పాల్పడినట్లు రుజువైతే విద్యాసంస్థల నుండి బహిష్కరించడమే కాకుండా, చట్టప్రకారం జైలు శిక్ష మరియు భారీ జరిమానా విధిస్తారు అని తెలిపారు. ప్రతీ కళాశాలలో ప్రత్యేక కమిటీలను తప్పనిసరిగా ఉండాలి అని తెలిపారు. ర్యాగింగ్ రహిత సమాజం కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యాలు బాధ్యతగా వ్యవహరించాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో ఛీఫ్ లీగల్ ఏయిడ్ కౌన్సిల్ ఆర్.సురేష్, అసిస్టెంట్ లీగల్ ఏయిడ్ ఆర్. రజిని, కళాశాల ప్రిన్సిపాల్ డా.వి.రాధిక, అధ్యాపకులు, సిబ్బంది, సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# నా దారి.. రహదారి...

(మొదటి పేజీ తరువాయి)

దాటేందుకు కొంత సమయం పట్టింది.

ఈ అరుదైన దృశ్యాన్ని అక్కడున్న పలువురు సందర్శకులు తమ మొబైల్ ఫోన్లలో వీడియోలు తీశారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతూ పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి. కొండచిలువ కనిపించడంతో వాకర్లు కొంతసేపు అప్రమత్తంగా ఉండగా, అనంతరం అది ఎలాంటి హాని చేయకుండా సహజంగానే పార్కులోని అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయింది. ఈ ఘటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని సమాచారం.



నగరం మధ్యలో ఉన్న కేబీఆర్ జాతీయ పార్కు అనేక రకాల పక్షులు, అడవి జంతువులు, సరీసృపాలకు సహజ ఆవాసంగా ప్రసిద్ధి చెందింది. వర్షాకాలంలో ఆహారం కోసం ఇలాంటి వన్యప్రాణులు అప్పుడప్పుడు నడక మార్గాల వద్దకు రావడం సాధారణం. ఈ ఘటన మరోసారి కేబీఆర్ పార్కులోని జీవవైవిధ్యాన్ని గుర్తు చేసింది. అడవి జంతువులు లేదా సరీసృపాలు కనిపించినప్పుడు వాటికి దూరంగా ఉండాలని, ఫోటోలు లేదా వీడియోల కోసం దగ్గరకు వెళ్లి రెచ్చగొట్టే ప్రయత్నం చేయవద్దని నిపుణులు సూచిస్తున్నారు. వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని నిపుణులు ప్రజలకు కోరుతున్నారు.

పీపుల్స్ డైరీ
వరంగల్
ఆదివారం, 19 జూలై 2026
సంపుటి : 18, సంచిక : 132


# అసమానతలు ఉన్నంతకాలం కమ్యూనిస్టులకు అంతం లేదు

- ప్రజా సమస్యలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులే
- బీజేపీని అడ్డుకునేందుకు వామపక్షాలను బలోపేతం చేయాలి
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు
- భూపాలపల్లిలో సిపిఐ రాజకీయ శిక్షణ శిబిరం ప్రారంభంలి



**భూపాలపల్లి జూలై 18 పీపుల్స్ డైరీ..** అసమానతలు ఉన్నంతకాలం కమ్యూనిస్టులకు అంతం లేదని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శనివారం భూపాలపల్లి మంజూరు నగర్ లోని ఇల్లందు క్లబ్ లో మోట పలుకుల రమేష్ అధ్యక్షతన భూపాలపల్లి జిల్లా రాజకీయ శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. తొలుత శిక్షణా తరగతుల ప్రాంగణంలో సిపిఐ పతాకాన్ని ఎగురవేసిన అనంతరం శిక్షణా తరగతులను తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యలపై అనునిత్యం పోరాడుతున్నది కమ్యూనిస్టులేనని అన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత మతతత్వ శక్తుల ఆగడాలు పెరిగిపోయాయని, ప్రజాసమస్యలను విస్మరించి కార్పొరేట్ శక్తులకు మోడీ ప్రభుత్వం దేశ సంపదను దోచి పెడుతున్నదని అన్నారు. దేశంలో బిజెపిని అడ్డుకునేందుకు వామపక్షాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. బిజెపి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ప్రభుత్వానికి తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. పాలకులు పేదల అనుకూల విధానాలను అవలంబించడం లేదని, ప్రధాని నరేంద్ర మోదీ బంగారం కొన వద్దంటూ పేదలకు నీతులు చెబుతూ పెద్దలకు అనుకూలంగా మెదులుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని, ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు జీవో 58 ప్రకారం పట్టాలు ఇస్తామని చెప్పి నేడు అమలు చేయడం లేదన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది ఇండ్లు లేని నిరుపేదలు ఉన్నారని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు గడిచినా పేదవాడి జీవితం మార లేదని అన్నారు. పేదలు సిపిఐ ఆధ్వర్యంలో అనేక చోట్ల భూపోరాటాలు నిర్వహించి గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని, వారందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కమ్యూనిస్టుల మద్దతు ఉంటేనే ప్రభుత్వాలు మనగలుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, ప్రిన్సిపాల్ వ్యవహరించిన ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్, వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, సిపిఐ జిల్లా నాయకులు పైళ్ళ శాంతి కుమార్, మామిడాల సమ్మిరెడ్డి, క్యాథరాజు సతీష్, పరమండ్ల రాజయ్య, కొరిమి సుగుణ, పెంట రవి, సోతుకు ప్రవీణ్ కుమార్, నాయకులు నేరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్, కుడుదుల వెంకటేష్, తాళ్ల పోశం, ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీలు జి శ్రీనివాస్, ఆసిఫ్ పాషా, ఏఐటీయూసీ నాయకులు కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

# కెజిబివి , సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారానికై పోస్ట్ కార్డు ఉద్యమం

- టీఎస్ యూటిఎఫ్ ములుగు అధ్యక్షులు పోడెం సమ్మయ్య.



**ఏటూరు నాగారం జూలై 18 (పీపుల్స్ డైరీ) :** టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి గారికి కేజీబీవీ మరియు సమగ్ర శిక్ష ఉపాధ్యాయుల, ఉద్యోగుల సమస్యలపై పోస్ట్ కార్డు ఉద్యమం ప్రారంభించటం జరిగింది. ఈ రోజు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఏటూరునాగారంలో జరిగిన కార్యక్రమానికి టీఎస్ యుటిఎఫ్ ములుగు జిల్లా అధ్యక్షులు పోడెం సమ్మయ్య హాజరై మాట్లాడుతూ కేజీబీవీ , యూఆర్ఎస్ మరియు సమగ్ర శిక్ష లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు దశాబ్దాలుగా శ్రమదోపిడికి గురౌతున్నారు. ఉపాధ్యాయ ఉద్యోగులందరికీ వెంటనే మినిమం టైం స్కేల్ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ఈ రోజు రాష్ట్రంలోని రెగ్యులర్ ఉపాధ్యాయులకు ఉద్యోగులకు అందచేసిన హెల్త్ కార్డ్ లు కేజీబీవి మరియు యూఆర్ఎస్ ఉపాధ్యాయులకు అందచేయాలి . రెగ్యులర్ ఉపాధ్యాయులు వినియోగించుకుంటున్న సెలవులన్నీ వినిగిం చుకునే విధంగా అవకాశం కల్పించాలని, హాస్టళ్లకు కేర్ టేకర్లను నియమించాలని, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వార్షిక ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని కోరారు .ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ ఏటూరునాగారం మండల అధ్యక్షులు పత్రి కిరణ్ ఉపాధ్యాయులు ఎం . అరుణ,ఎం. సంతోష్, వై. స్వరూప, బి హరిత , సమగ్ర శిక్ష ఉద్యోగులు కె. సత్యరావు, ఆర్.విజయ్, చందర్ రావు పాల్గొన్నారు.

# ఏటూరునాగారం రెవిన్యూ డివిజన్ గా ఆమోదించాలి

**బిజెపి డిమాండ్**



**ఏటూరునాగారం జూలై 18 (పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షులు వినుకొల్లు చక్రవర్తి ఆధ్వర్యంలో శనివారం రెవిన్యూ డివిజన్ కొరకై ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన బిజెపి జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు డాక్టర్ జాడి రామరాజు నేత హాజరై మాట్లాడుతూ ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్ గత మూడు సంవత్సరాల క్రితం 07-10-2 023 నాడు ప్రకటన చేసిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు ఏటూరునాగారంలో రెవెన్యూ డివిజన్ ఆఫీసర్ సిబ్బంది నియమించలే, పేపర్లకు మాత్రమే పరిమితం అయిపోయింది. పంచాయతీరాజ్ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) G.O విడుదల చేసిన తర్వాత కూడా ఏటూరునాగారం రెవిన్యూ డివిజన్ కాకుండా అడ్డుపడుతుంది. ఏటూరునాగారం, మంగపేట, తాడ్వాయి, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం మండల ప్రజలపై ప్రేమ లేదు. గిరిజనులు దళితులను వెనుకబడిన ప్రజల మీద ప్రేమ ఉంటే ఈ ప్రాంతం ప్రజలు ఇబ్బంది పడొద్దు అనుకుంటే ఏటూరునాగారం రెవిన్యూ డివిజన్ ఆఫీస్ సిబ్బందినీ వెంటనే నియమించాలి లేనిచో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజలందరూ కలుపుకొని రెవెన్యూ డివిజన్ సాధన కోసం దశలవారీగా కార్యక్రమాలకు ముందుకెళ్తాం. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బర్తరపు నరేష్ జిల్లా కార్యదర్శి లింగంపల్లి శ్రీనివాస్ దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు వావిలాల జనార్ధన్, జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి గాడిచెర్ల రాజశేఖర్ , మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పలక గంగ, జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షులు గడ్డం శ్రీధర్, మండల నాయకులు ఎర్రల ఎల్లయ్య , మండల ఉపాధ్యక్షులు యానాల చంద్ర రెడ్డి, బొల్లె శ్రీను, మండల కార్యదర్శులు కందకట్ల రమేష్, దుర్గం దుర్గారావు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు ఇరుస వడ్ల జగన్ , మహిళా మండల అధ్యక్షురాలు ఆత్కూరి ప్రేమలత, మహిళా మోర్చా మండల ప్రధాన కార్యదర్శి మలకం స్వరూప, మండల సోషల్ మీడియా కన్వీనర్ దుర్గం శ్రావణ్ ,యువ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి కొండ గొర్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# కన్నులపండువగా వరుణ యాగం

**హాజరైన అర్చక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమరేశ్వర్‌శర్మ, రాష్ట్ర కోశాధికారి హరికిషన్**



**ఏటూరునాగారం జూలై18 (పీపుల్స్ డైరీ) :** రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామాలన్నీ సుభిక్షంగా ఉండాలని దూప దీన నైవేద్యం జిల్లా అర్చక సంఘం ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన వరుణయాగం, గణపతి పూజ, గౌరి పూజలు కన్నులపండువగా జరిగాయి. ములుగు జిల్లాలోని ఏటూరు నాగారం మండల కేంద్రంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో అర్చకులు ఉదయం 9 గంటలకు గణపతి పూజను స్థానిక సర్పంచ్ కాకులమర్రి శ్రీలత, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మినర్సింహరావు చేతుల మీదుగా దీపారదన చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ పాడిపంటలు, సంవృద్ధిగా వర్షాలు కురువాలని, సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. ప్రత్యేక పూజలు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వరున్కి పూజలు చేసి వరుణ యాగం ను వేదపండితులు యల్లాప్రగడ మణికంటశర్మ, యల్లాప్రగడ రుత్విక్‌సాయి-ంశర్మ పూజలు జరిపించారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని ముగించుకొని వరుణయాగంలో ఏర్పాటు చేసిన జలాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి బొడ్రాయి అమ్మవారికి అభిషేకం చేసి నూతన వస్త్రాలను అర్చక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమరేశ్వర్‌శర్మ, రాష్ట్ర కోశాధికారి హరికిషన్ లు అలంకరించారు. భక్తులతో అమ్మవారికి పుష్పాభిషేకం చేశారు. తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

**ఐటీ కార్డు పంపిణీ**

దూప దీప నైవేద్యం కింద మంజూరైన ఆలయ అర్చకులకు రాష్ట్ర అర్చక సంఘం ప్రధాన కార్యదర్శి అమరేశ్వర్‌శర్మ, కోశాధికారి హరికిషన్‌లు ఐడీ కార్డులను రామాలయంకు అందజేశారు. రామాలయాన్ని కూడా దూప దీప నైవేద్యం స్కీంలో చేర్చాలని రాష్ట్ర అర్చకులకు ఆలయ చైర్మన్ అలువాల శ్రీనివాస్ విన్నవించారు. ఆలయం ప్రాశీ గణం, ఆలయ అభివృద్ధి బాగుందని, ఈసారి స్కీంలో పెట్టించే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యల్లాప్రగడ నాగేశ్వర్‌రావుశర్మ, సూర్యనా రాయణశర్మ, ఏఎన్‌శర్మ, వెంకట రమణ చార్యులు, కర్నె సాంబయ్య, ములుగు జిల్లా అధ్యక్షుడు మూడుంబై రాఘునాథచార్యులు, గౌరవ అధ్యక్షుడు పురుషోత్తంచార్యులు, శివ సత్యనారాయణ, వివేకానందస్వామి, రామాలయం కమిటీ ప్రధాన కార్యదర్శి కత్తెర శ్రీనివాస్, కోశాధికారి దీనబాంధవస్వామి, పోగుల లక్ష్మీనారా యణ, కిరణ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేవులపల్లి విజయ్, ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు, శివాలయం చైర్మన్ మదుగూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ పిల్లలను పనిలో నియమించడం చట్టవిరుద్ధం

**ఆపరేషన్ ముస్కానలో ఎకరిపై కేసు నమోదు..**

**రేగొండ జూలై 18 పీపుల్స్ డైరీ..** ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా రేగొండ పోలీస్ స్టేషన్ పరిధి రంగయ్య పల్లి గ్రామం వద్ద శనివారం తనిఖీలు నిర్వహించగా, టేకుమట్ల గ్రామానికి చెందిన గునిగంటి మహేందర్, అనే ట్రాక్టర్ ఓనర్ తన వద్ద అదే గ్రామానికి చెందిన మైనర్ బాలున్ని డ్రైవర్ గా పనిలో నియమించుకొని, ట్రాక్టర్ నడిపిస్తున్నట్లు గుర్తించమని రేగొండ ఎస్సై సుధాకర్ తెలిపారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ అందించిన ఫిర్యాదు మేరకు గునిగంటి మహేందర్‌పై చట్టప్రకారం కేసు నమోదు చేసి కేసులో సంబంధిత జువెనైల్ జస్టిస్ (జే.జే) చట్టం, మోటార్ వెహికల్స్ చట్టం , ఇతర చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తునట్టు ఎస్సై వివరించారు. ఈ సందర్భంగా ఎస్సై సుధాకర్ మాట్లాడుతూ. మైనర్ పిల్లలను పనిలో నియమించడం, అలాగే వారితో వాహనాలు నడిపించడం చట్టవిరుద్ధం. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటమని. ప్రజలు తమ పరిసరాల్లో బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం లేదా మైనర్లతో వాహనాలు నడిపించడం గమనించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని రేగొండ ఎస్సై సుధాకర్ తెలిపారు.

# నూతన వాటర్ మోటార్ ప్రారంభం

**మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత ఆధ్వర్యంలో ..**



**ఏటూరు నాగారం జూలై 18 (పీపుల్స్ డైరీ) :** స్థానిక మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని 12వ వార్డులో ప్రజల నీటి ఇబ్బందులను తొలగించేందుకు ఏర్పాటు చేసిన నూతన వాటర్ మోటార్‌ను శనివారం ఏటూరు నాగారం గ్రామపంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడటమే తమ ప్రాధాన్యత అని, వార్డులోని ప్రతి ఇంటికి మెరుగైన నీటి సౌకర్యం కల్పించే దిశగా నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వార్డు మెంబర్ కోయల కృష్ణవేణి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, గడదాసు సునీల్ కుమార్, తాడూరి రఘు, ఉప సర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, కార్యదర్శి వాసం జనార్ధన్, దన్నపునేని కిరణ్, బండి లక్ష్మి, వార్డ్ సభ్యులు కొండాయి చిన్ని, గండేపల్లి నాగరాజు, గంప కిరణ్, కాకులమర్రి అరుణమ్మ భాస్కర్ బాబు, అంగాల వీరన్న, కాళ్ళ రామకృష్ణ, బట్టు గోపి, బట్టు కొమురయ్య, పెద్ద బోయిన బాలకృష్ణ, ఎస్.కె బాబా, మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# ఆళ్ళపల్లి మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడుకి సన్మానం



**ఆళ్ళపల్లి జూలై 18(పీపుల్స్ డైరీ) :** మండల పరిధిలోని బోడైకుంత గ్రామం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఏడుల్లా రామ్మూర్తి ( అగ్ని) ఆధ్వర్యంలో నూతనంగా నియమించిన ఆళ్ళపల్లి మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వాసం శ్రీకాంత్ ని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియచేయడం జరిగింది ఈ సందర్భంగా ఆళ్ళపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నూతన మండల అధ్యక్షులు వాసం శ్రీకాంత్ మాట్లాడుతూ ఆళ్ళపల్లి మండలంలోని ప్రతి కార్యకర్తను కలుపుకొని సీనియర్ నాయకుల సలహాలు సూచనలు పాటిస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బోడైకుంత గ్రామ అధ్యక్షులు ఏడుళ్ల లింగయ్య , సత్యం తదితరులు పాల్గొన్నారు,

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి

**జూలై 20 నుండి 26 వరకు దోస్త్ స్పెషల్ ఫేజ్ రిజిస్ట్రేషన్**




**హుస్నాబాద్, టౌన్: (పీపుల్స్ డైరీ) జూలై 18:** ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హుస్నాబాద్‌లో చేరేందుకు చివరి అవకాశం లభించింది. 2026--27 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రవేశాల కోసం తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దూూ-2026) ద్వారా నిర్వహిస్తున్న స్పెషల్ ఫేజ్ (చివరి విడత) రిజిస్ట్రేషన్లు జూలై 20 నుంచి 26 వరకు కొనసాగనున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయగిరి బిక్షపతి తెలిపారు. శాతవాహన విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హుస్నాబాద్‌లో బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్), బీఎస్సీ ఫిజికల్ సైన్స్ (మ్యాథమెటిక్స్--ఫిజిక్స్--కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ లైఫ్ సైన్స్ (బోటనీ--జువాలజీ--కెమిస్ట్రీ), బీఏ (ఎకనామిక్స్--హిస్టరీ--పొలిటికల్ సైన్స్) కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ఆధునిక కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లు, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, విశాలమైన గ్రంథాలయం, క్రీడా మైదానం, ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాల పెంపు వంటి ప్రత్యేక సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. అలాగే ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని వివరించారు. విద్యార్థులు తమ ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో దోస్త్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసి, వెబ్ ఆప్షన్లలో గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, హుస్నాబాద్ ను ఎంపిక చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు హుస్నాబాద్ మినీ స్టేడియం సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణాన్ని సంప్రదించాలని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయగిరి బిక్షపతి కోరారు.

# ఏకగ్రీవంగా ఎన్నికైన హార్వెస్టర్స్ యూనియన్ ప్రెసిడెంట్ కోలుగూరి రాము



**వీణవంక జులై 19( పీపుల్స్ డైరీ) :** మండల పరిధిలోని కొండపాక గ్రామంలో హార్వెస్టర్స్ ఓనర్స్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన హార్వెస్టర్స్ యూనియన్ ప్రెసిడెంట్ గా కొల్గూరి రాము ను ఏకగ్రీవంగా ని యమించడం జరిగింది. ఈ సం దర్భంగా ఓనర్స్ అందరు కలిసి కోర్కల్ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లిం చుకొని స్వామి వారి ఆశీర్వాదం ప్రజల అందరి పై ఉండాలని వారు కోరారు. హార్వెస్టర్ యూనియన్ ప్రెసిడెంట్ కొల్గూరి రాము మాట్లాడుతూ. సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండి రైతుల కళ్ళల్లో ఆనందం కలగాలని ఆ భగవంతుని ఆశీర్వాదం ప్రజల అందరిపై ఉండాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాసర్ల సుధాకర్ సంగెంసారయ్య ఈదునూరి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా కవి అందే శ్రీ జయంతి



**హుస్నాబాద్, జులై 18, (పీపుల్స్ డైరీ ):** అందే శ్రీ చిత్రపటానికి నివాళులు అర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్,ఎమ్మెల్సీ కోదండరాం , మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ ,మోతె శోభన్ రెడ్డి, కవులు కళాకారులు.ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో అందే శ్రీ రచించిన జయ జయహే తెలంగాణ గీతం ఉద్యమంలో స్ఫూర్తిని నింపి సబ్బండ వర్గాలను ఒక్క తాటి పైకి తీసుకొచ్చిందని కొనియాడిన మంత్రి పొన్నం ప్రభాకర్ అనంతరం తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన కవులు, కళాకారులు ,రచయితలతో ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సమావేశం.తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి గౌరవించడానికి కళాకారుల సలహాలు సూచనలు అభిప్రాయాలు రికార్డు చేస్తున్న కమిటీ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలంగాణ ఉద్యమంలో ముఖ్య పాత్ర వహించిన అన్ని వర్గాల ప్రజల గుర్తింపు గౌరవించుకోవడానికి ఎలా చేయలేదని పై గత 15 రోజులుగా ఉద్యమకారుల గుర్తింపు కమిటీ అభిప్రాయ సేకరణ చేస్తుంది. ప్రతి ఒక్కరి అభిప్రాయాలు తీసుకుంటున్నాం.కవులు , కళాకారులు రచయితలు ఉద్యమ స్ఫూర్తికి మూలకారకులు.ప్రజా పాలన ప్రభుత్వం లో ఉద్యమకారులను గౌరవించుకోవడానికి కమిటీ వేసింది.. సబ్బండ వర్గాల అభిప్రాయాన్ని సేకరిస్తుంది.

## నీటి పై రాజకీయం చేయడం బిఆర్ఎస్ పనికి మాలిన మాటలు మానుకోవాలి

**కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి వావిలీల సత్యనారాయణ**



**వీణవంక జులై 19( పీపుల్స్ డైరీ) :** మండలంలో విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కించపరిచే విధంగా చేస్తున్న టిఆర్ఎస్ ప్రభుత్వం మాజీ మంత్రి హరీష్ రావు మూడు నెలలు అవకాశమిస్తే రైతులకు నీరు అందిస్తానని మాట్లాడడం బాధగా ఉందని గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో సరిగా ప్రాజెక్టులు నిర్మించడంలో విఫలమై ఇప్పుడు రైతుల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని వావిలీల సత్యనారాయణ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎన్నో సంక్షేమ పథకాలతో పాటు రైతులను దృష్టిలో ఉంచుకుని రైతు సేవకులకు పాటుపడుతున్న వ్యక్తి కాంగ్రెస్ పార్టీ అని ఆయన అన్నారు. రైతుల కొరకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు ముందు ఉంటదని రైతు శ్రేయస్ కొరకే పాటు పడుతుందని ఆయన అన్నారు. ఇలాంటి పలికి మాలిన మాటలను మానుకోవాలని ఆయన హెచ్చరించారు.

## బంజారుల ఆరాధ్య దైవం హతిరాం బాలాజీ

**ఘనంగా హతిరాంబాలాజీ జయంతి వేడుకలు.**



**హుస్నాబాద్, టౌన్: (పీపుల్స్ డైరీ) జూలై 18 :** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట మండలం సేవాలాల్ మహారాజ్ తండాలో హతిరం బాలాజీ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తండా ప్రజలు, గిరిజన మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని తమ సంస్కృతి, ఆచారాలను ప్రతిబింబించేలా వేడుకలను నిర్వహించారు.వేడుకల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భోగ్ బండార్ ఏర్పాటు చేసి నైవేద్యాలు సమర్పించారు. గిరిజన మహిళలు ప్రదర్శించిన సాంప్రదాయ నృత్యాలు హాజరైన వారిని విశేషంగా ఆకట్టుకుని వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ సందర్భంగా గిరిజన నాయకులు మాట్లాడుతూ బంజారా కలియుగ దైవం హతిరాం బాలాజీ అని ఇక్కడ పుణ్యక్షేత్రం కట్టడం బంజారాలకు ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంటుందని అన్నారు.అందరూ కలిసికట్టుగా సహాయ సహకారాలు అందించి ఈ పుణ్యక్షేత్రానికి సహకరించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో సీఐ కాశీరాం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లావుడ్య వీరన్న నాయక్, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర ప్రభాకర్ గౌడ్,బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ధారావతు తిరుపతి నాయక్, బంజారా గాన కోకిల ఎస్పీ నాయక్, సింగిల్ విండో వైస్ చైర్మన్ ఐలయ్య, గిరిజన నాయకులు రమేష్ నాయక్‌తో పాటు గిరిజన కుల పెద్దలు, మహిళలు, గ్రామస్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలి

**ప్రతి గ్రామం నుంచి భవన నిర్మాణ కార్మికులు భారీగా తరలిరావాలి:**
**అధ్యక్షులు రాధారపు సంపత్**



**సైదాపూర్ జూలై 18 ( పీపుల్స్ డైరీ )** :సైదాపూర్, : రేపు నిర్వహించనున్న కరీంనగర్ కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని సైదాపూర్ మండలంలోని ప్రతి గ్రామం నుంచి భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సైదాపూర్ మండల భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు రాధారపు సంపత్ ఒక ప్రకటనలో తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను కార్మికుల సంక్షేమానికే వినియోగించాలని, పెండింగ్‌లో ఉన్న సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టనున్న ఈ కలెక్టరేట్ ముట్టడిలో ప్రతి గ్రామం నుంచి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాధారపు సంపత్ పిలుపునిచ్చారు

## కనీసం రోడ్డు మార్గం లేదు...ఇప్పటికీ తప్పని డోలీ మోత కష్టాలు

- ఆపద్బాంధవుల సాహసం-
- అంబులెన్స్ వెళ్ళడానికి లేని రోడ్డు మార్గం.
- అయిన ప్రాణాలు కాపాడిన అంబులెన్స్ సేవకులు.



**ఏటూరు నాగారం జూలై 18 (పీపుల్స్ డైరీ) :**ప్రభుత్వాలు మారిన మారుమూల గిరిజన ప్రాంతాల బతుకులు మారడం లేదు రోడ్డు మార్గం లేక అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని మైళ్ళ దూరం డోలీ మోతతో రోడ్డుకు చేరిన జ్వర పీడితుడు విధుల్లో ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా పని చేసే 108 ఆపద్బాంధవులు చేసిన ఈ గొప్ప పనికి యావత్ ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తున్నారు. ములుగు జిల్లా ఏజెన్సీ ఐటిడిఎ ఏటూరునాగారం మండలం గుర్రాలాబావికి చెందిన గోత్తి కోయ గిరిజన యువకుడు మడకం అయితయ్య 18 సంవత్సరాల గత నాలుగు రోజుల నుండి జ్వరం రావడంతో దగ్గరలోని ఆర్ ఎం పి దగ్గర చికిత్స తీసుకున్నాడు. అప్పటికి నయం కాకపోవడంతో రక్త కణాలు తగ్గి అపార్మరక స్థితిలోకి వెళ్ళిపోయాడు. గమనించిన బంధువులు ఏటూరునాగారం అంబులెన్స్ కి సమాచారం ఇవ్వగా విషయం తెలుసుకున్న ఈ ఏం టి శివలింగం ప్రసాద్, పైలట్ కోటి హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని వెళ్ళి చూడగా కనీసం రోడ్డు మార్గం లేని బురద కాలి నడకన , అంబులెన్స్ వెళ్లలేని పరిస్థితి ఉండడంతో ఎలాగైనా ప్రాణాలు నిలిపాలని ఎదురుగా వెళ్ళి డోలీ సహాయంతో రోడ్డు, అంబులెన్స్ వరకు భుజాన మోసుకొచ్చారు. అనంతరం బాధితుని పరీక్షించగా అపస్మారక స్థితిలోకి వెళ్ళాడు. యువకునికి బాడీలో చక్కెర స్థాయి పడిపోయి, తీవ్ర జ్వరం ఉండడాన్ని గమనించి ఈఆర్సిపి డాక్టర్ మౌనిక సూచన, సలహాల మేరకు కావలసిన సూదులు, మందులు, గ్లూకోజు బాటిల్ ఇచ్చి హుటాహుటిన మెరుగైన వైద్యసేవల కి ఏటూరునాగారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కి తరలించి పూర్తి వివరణను వైద్యులకు వివరించి చేర్పించారు. ఇంతటి గొప్ప మానవత్వాన్ని చాటుకున్న అంబులెన్స్ సేవకులు, ఉపకారులకు యావత్ ప్రజానీకం అభినందించారు. ప్రాణం విలువ లెక్క కట్టనిది, ప్రాణం మీదకు వచ్చినప్పుడు అంబులెన్స్ కి కాల్ చేసి వచ్చి తీసుకెళ్లి ప్రాణాన్ని కాపాడుతుందన్న నమ్మకాన్ని నిలబెట్టుకున్న అంబులెన్స్ నిర్వహణ సంస్థకు, సిబ్బందికి స్థానికులు శభాష్ అంటున్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం-వైద్య ఖర్చులకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం

- మహమ్మదాపూర్‌లో చెక్కుల పంపిణీ
- వెన్న రాజు -హుస్నాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు



**హుస్నాబాద్ , టౌన్: (పీపుల్స్ డైరీ) జూలై 18:** ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేద కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించి అండగా నిలుస్తోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెన్న రాజు అన్నారు. మహమ్మదాపూర్ గ్రామంలో శనివారం నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారురాలు బొల్లి సమీక్ష (శ్రీనివాస్ కుమార్తె)కు చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా వెన్న రాజు మాట్లాడుతూ, అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి వరంలా మారిందన్నారు. ఈ పథకం ద్వారా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు కూడా నిరుపేదలకు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.సీఎంఆర్ఎఫ్ చెక్కు అందుకోవడంతో లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి, సహకరించిన ప్రజాప్రతినిధులు, నాయకు లకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు సంఘ శ్రీధర్, డీసీసీ కార్యదర్శి మామిడి తిరుపతి, ఉప సర్పంచ్ కత్తుల సమ్మరాజు, వార్డు సభ్యులు బొల్లి తిరుపతి, మెరుగు వెంకటయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దుద్దెడ తిరుపతి, దుద్దెడ శ్రీనాథ్, ఆకుల వెంకటస్వామి, జిల్లెల తిరుపతి రెడ్డి, మోకాళ్ల నరసింహులు, మోకాళ్ల మాధవరెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కాక్రోజ్ జనతా పార్టీ ఉద్యమానికి టీఆర్పీ సంపూర్ణ మద్దతు

- కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మహిళా అధ్యక్షురాలు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ...
- నీట్ బాధితులకు రూ.1 కోటి నష్టపరిహారం చెల్లించాలని టీఆర్పీ డిమాండ్...
- కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలి -- తెలంగాణ రాజ్యాధికార పార్టీ...
- విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడిన కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలి...
- రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా



**కరీంనగర్, జూలై 18:పీపుల్స్ డైరీ :**తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న , రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఢిల్లీలో కాక్రోజ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉద్యమానికి సంఘీభావంగా కరీంనగర్ జిల్లా తెలంగాణ రాజ్యాధికార పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా మహిళా అధ్యక్షురాలు రాచురి అరుణ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా మాట్లాడుతూ, కాక్రోజ్ జనతా పార్టీ చేపట్టిన ప్రజా ఉద్యమానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన ఘోర వైఫల్యాలు, అవకతవకలు, నిర్లక్ష్యం కారణంగా దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురయ్యారని, అనేక కుటుంబాలు నష్టపోయాయని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసిన కేంద్ర ప్రభుత్వం దీనికి పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. నీట్ వ్యవహారంలో నష్టపోయిన ప్రతి బాధిత విద్యార్థి కుటుంబానికి రూ.1 కోటి నష్టపరిహారం కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ వ్యవహారంపై నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ తరపున గట్టిగా డిమాండ్ చేశారు. దేశ భవిష్యత్తైన విద్యార్థుల జీవితాలతో రాజకీయాలు చేయడం, పరీక్షల నిర్వహణలో బాధ్యతా రాహిత్యం ప్రదర్శించడం క్షమించరాని నేరమని అన్నారు. విద్యను కార్పొరేట్ సంస్థల చేతుల్లో పెట్టి సామాన్య, మధ్యతం గతి కుటుంబాల పిల్లల జీవితాలను ప్రమాదం లోకి నెట్టే విధానాలను టీఆర్పీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. ప్రజల హక్కులు, విద్యార్థుల భవిష్యత్తు, సామాజిక న్యాయం కోసం జరిగే ప్రతి ఉద్యమానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ అండగా నిలుస్తుందని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, ప్రధాన కార్యదర్శి చిగుర్ల మోహన్, కార్యదర్శి దాట్ల శ్రీనివాస్, జిల్లా మహిళా అధ్యక్షురాలు రాచురి అరుణ దేవి, జిల్లా మైనారిటీ అధ్యక్షులు మొహమ్మద్ వాజిద్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి మంతెన శ్రీకాంత్, టౌన్ ప్రధాన కార్యదర్శి ఎగుర్ల రమేష్, మండలాల అధ్యక్షులు శువరాత్రి మోహన్, ఓర్సు రాజు, ఓర్సు విమల పార్టీ నాయకులు మహబూబ్ అలీ, కోరే గంగ, గుండోజు పద్మ, నేదునూరి రాజు, నేదునూరి కుమారస్వామి, గుండోజు సదానందం, దారంగుల గణేష్, మోహన్, మధు, ధర్మారపు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## సీడ్ ప్లాంట్ల యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్



**హుజురాబాద్, జూలై 18 (పీపుల్స్ డైరీ):** కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా రైతులను ఆర్థికంగా మోసం చేస్తున్న సీడ్ ప్లాంట్ల యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, రైతులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు.

**సీపీఎం మండల కమిటీ సమావేశం**

శనివారం హుజురాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో కామ్రేడ్ కే. చంద్రయ్య అధ్యక్షతన సీపీఎం మండల కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో మండల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.

**ఒప్పందాలను ఉల్లంఘించి రైతులను మోసం చేస్తున్నారు**

ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ, హుజురాబాద్ నియోజకవర్గంలో రైతులు పెద్దఎత్తున వరి విత్తనాలు ఉత్పత్తి చేసి సీడ్ ప్లాంట్లకు విక్రయిస్తారని తెలిపారు. 2025 నవంబర్‌లో రైతులతో ధరలపై ఒప్పందాలు చేసుకున్న సీడ్ ప్లాంట్ల యజమానులు, పంట సేకరణ అనంతరం 2026 మేలో కొత్త ఒప్పందాల పేరుతో ధరలు తగ్గించి రైతులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు.

**నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయాలి**

తరుగులు, తూకం పేరుతో రైతుల నుంచి ప్రతి సంవత్సరం కోట్ల రూపాయలు అక్రమంగా వసూలు చేస్తున్న సీడ్ ప్లాంట్ల యజమానులపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రైతులతో కుదుర్చుకున్న ఒప్పందాలను ఉల్లంఘించి, ధాన్యం సేకరించిన తర్వాత ధరలు తగ్గించడం రైతుల గొంతు నులిమినట్టేనని అన్నారు.

**రైతులకు న్యాయం చేయాలి**

జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులు జోక్యం చేసుకుని రైతులకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

**ప్రభుత్వానికి పలు డిమాండ్లు**

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులకు వెంటనే కేటాయించాలని, ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, ప్రైవేటు విద్యా, వైద్య రంగాల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు కొరత లేకుండా అందుబాటులో ఉంచాలని కోరారు

33 రకాల వరి వంగడాలకు బోనస్ ఇవ్వాలి

గతంలో ప్రకటించిన 33 రకాల వరి వంగడాలకు యథావిధిగా బోనస్ చెల్లించాలని, కేవలం 8 రకాల వరి వంగడాలకు మాత్రమే బోనస్ పరిమితం చేయడం వల్ల రైతులు నష్టపోతున్నారని అన్నారు. అలాగే వ్యవసాయానికి నాణ్యమైన 24 గంటల విద్యుత్ సరఫరా అందించడంతో పాటు వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని కోరారు.

**ఆందోళన కార్యక్రమాలు చేపడతాం**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు చివరి వరకు గ్రామాల్లో సభలు, సమావేశాలు, చర్చా వేదికలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి కొప్పుల శంకర్, మండల కమిటీ సభ్యులు ప్రతాప్ శ్రీనివాస్, కొంకట చంద్రయ్య, ఇమ్మడి దేవేందర్, అజ్జు, శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పీపుల్స్‌డైరీ
వరంగల్
ఆదివారం, 19 జూలై 2026
సంపుటి : 18, సంచిక : 132


# విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమా..?

## బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షులు నెల్లి శ్రీనివాస్

- స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి



**సైదాపూర్ జూలై 18 ( పీపుల్స్ డైరీ) :** కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలోని వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టివేయబడుతోందని సైదాపూర్ బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షులు నెల్లి శ్రీనివాస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లొమా, నర్సింగ్ తదితర కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు పై చదువులు, ఉద్యోగాలు, పోటీ పరీక్షల కోసం అవసరమైన టీసీలు, మెమోలు, ఒరిజినల్ సర్టిఫికెట్ల కోసం కళాశాలలకు వెళ్తే, ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు రాకపోవడంతో కళాశాల యాజమాన్యాలు ముందుగా ఫీజులు చెల్లించాలని కోరుతున్నాయని నెల్లి శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వ వైఫల్యానికి విద్యార్థులను బలిచేయడం దారుణమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ. 11 వేల కోట్లకు పైగా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోవడంతో విద్యాసంస్థలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాయని, అధ్యాపకులకు జీతాలు చెల్లించలేని పరిస్థితులు ఏర్పడ్డాయని, కొన్ని కళాశాలలు మూతపడే పరిస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని విమర్శి ంచిన శ్రీనివాస్, విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయడం మానుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి హితవు పలికారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయిం బర్స్‌మెంట్ బకాయి లను వెంటనే విడుదల చేసి, ప్రతి విద్యార్థికి ఎలాంటి ఆటంకం లేకుండా సర్టిఫికెట్లు అందేలా ప్రభుత్వం అత్యవసర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడితే బిజెపి పార్టీ తరపున రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని ఈరాల శ్రీనివాస్ పైడిపల్లి సంతోష్ హెచ్చరించారు.

# పేదల ఇళ్లను కాపాడాలి-కమిషనర్‌కు కాలనీవాసుల వినతి

### ఎల్లమ్మ బజార్ రోడ్ వెడల్పు తగ్గించాలి



**హుస్నాబాద్, టౌన్: (పీపుల్స్ డైరీ) జూలై 18 :** హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ బజార్ రోడ్డును 70 అడుగుల వరకు విస్తరించేందుకు మున్సిపల్ అధికారులు చేపట్టిన మార్కింగ్‌ను నిలిపివేసి, రోడ్డు వెడల్పును తగ్గించాలని కోరుతూ కాలనీవాసులు శనివారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు అయిలేని మల్లికార్జున రెడ్డి, బీఎస్పీ నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణ పేరుతో పేద ప్రజలు తమ నివాసాలను కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇదే రోడ్డును 100 అడుగుల వరకు విస్తరించాలని అధికారులు మార్కింగ్ చేయగా స్థానికులు తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తు చేశారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి సమస్యను తీసు కెళ్లినా, రోడ్డు వెడల్పుపై స్పష్టమైన నిర్ణయం వెలువ డలేదన్నారు. ప్రస్తుతం సుమారు 40 అడుగుల వెడల్పు ఉన్న రోడ్డులో 22 అడుగుల బీటీ రోడ్డు ఉండగా, వాహనాల రద్దీ కూడా పెద్దగా లేదన్నారు. మరోవైపు రామవరం వైపు బైపాస్ రోడ్డు ప్రతిపాదన ఉన్న నేపథ్యంలో ఈ రోడ్డును 70 అడుగులకు విస్తరించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. హుస్నాబాద్ అభి వృద్ధికి తాము వ్యతిరేకం కాదని, అయితే అభివృద్ధి పేరుతో పేదల ఇళ్లను కూల్చివేసే నిర్ణయాలను అంగీకరిం చబోమన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రోడ్డు విస్తరణ ప్రణాళి కను పునఃపరిశీలించి, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో భూక్యా లక్ష్మన్ నాయక్, మార్క శ్రీనివాస్, పెరుమాండ్ల శ్రీనివాస్, లక్ష్మిరాజిరెడ్డి, మొండయ్యతో పాటు పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీకేజీపై కేంద్రాన్ని నిలదీసిన ఆవునూరి సమ్మయ్య

- సోనం వాంగ్చుక్ దీక్ష భగ్నం.. ఆసుపత్రికి తరలింపు



**హుజురాబాద్, జూలై 18 (పీపుల్స్ డైరీ) :** నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, గత 21 రోజులుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న ప్రముఖ విద్యావేత్త, పర్యావరణవేత్త, రామన్ మెగసెసే అవార్డు గ్రహీత సోనం వాంగ్చుక్ దీక్షను ఢిల్లీ పోలీసులు శనివారం భగ్నం చేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో బలవంతంగా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన పై పౌర సమాజం, మేధావుల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాస్వామ్యబద్ధంగా, అహింసా మార్గంలో దీక్ష చేస్తున్న ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తితో కేంద్ర ప్రభుత్వం కనీసం చర్చలు కూడా జరపకపోవడాన్ని వారు తప్పుబడుతున్నారు. ఈ నేపథ్యంలో సీనియర్ జర్నలిస్టు ఆవునూరి సమ్మయ్య కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ పోకడలను తీవ్రంగా ఖండిస్తూ హుజురాబాద్‌లో శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

### ప్రజాస్వామ్యానికి విరుద్ధమైన చర్య

దేశంలో పాలన రాజ్యాంగబద్ధంగా సాగడం లేదనడానికి ఈ ఘటనే నిదర్శనమని సమ్మయ్య విమర్శించారు. నీట్ పేపర్ లీకేజీ కారణంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని, కొందరు బలవన్మరణాలకు పాల్పడుతున్నారని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలనే లక్ష్యంతోనే సోనం వాంగ్చుక్ దీక్ష చేపట్టారని, ఇందులో ఆయనకు ఎలాంటి వ్యక్తిగత స్వార్థం లేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికైన పాలకులు ప్రజలకు జవాబుదారులుగా ఉండాలి. కానీ చర్చలకు రాకుండా పోలీసులతో దీక్షను భగ్నం చేయించడం పాలకుల అహంకారానికి, నియంతృత్వ ధోరణికి నిదర్శనమని ఆయన విమర్శించారు.

### అధికారం శాశ్వతం కాదు

అధికారంలో ఉన్నవారు అధికారం శాశ్వతం కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సమ్మయ్య హెచ్చరించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత పాలకులపై ఉందని పేర్కొన్నారు.

### ఇందిరా గాంధీ ఉదాహరణను గుర్తు చేసిన సమ్మయ్య

ఈ సందర్భంగా సోనం వాంగ్చుక్ కుటుంబ రాజకీయ నేపథ్యాన్ని సమ్మయ్య ప్రస్తావించారు. లడాఖ్‌కు చెందిన వాంగ్చుక్ తండ్రి సోనం వాంగ్యాల్ 1975లో జమ్మూ-కాశ్మీర్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారని తెలిపారు. ఎమర్జెన్సీ కాలంలో ఆయన ఆమరణ నిరాహార దీక్ష చేపట్టగా, అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ స్వయంగా దీక్షా శిబిరానికి వెళ్లి, ఆయనతో చర్చించి, డిమాండ్లపై సానుకూలంగా స్పందించి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారని గుర్తు చేశారు. నాడు ఇందిరా గాంధీ ప్రదర్శించిన ప్రజాస్వామ్య విలువలను, నేటి పాలకులు ప్రదర్శిస్తున్న వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

### వాంగ్చుక్ డిమాండ్లను పరిశీలించాలి

కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా మొండి వైఖరిని వీడి, సోనం వాంగ్చుక్ లేవనెత్తిన న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిశీలించాలని సమ్మయ్య కోరారు. దేశ విద్యా వ్యవస్థను పరిరక్షించేందుకు, విద్యార్థులకు న్యాయం జరిగేందుకు సోనం వాంగ్చుక్ చేస్తున్న పోరాటానికి దేశ ప్రజలందరూ అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

# స్వచ్ఛతే ఆరోగ్యానికి బాట

### డెంగ్యూ, మలేరియా నివారణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి-దండి లక్ష్మి హుస్నాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్



**హుస్నాబాద్, టౌన్: (పీపుల్స్ డైరీ) జూలై 18 :** హుస్నాబాద్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో 'సఫాయి అప్నా.. బీమారీ భగావో ' కార్యక్రమాన్ని శనివారం 2వ వార్డులో నిర్వహించారు. పురపాలక సంఘ చైర్‌పర్సన్ దండి లక్ష్మి ఆధ్వర్యంలో వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దండి లక్ష్మి మాట్లాడుతూ ప్రజలందరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడంతో పాటు ఇళ్ల పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నిల్వ నీటిని వెంటనే తొలగించడం, పాత టైర్లు, కుండలు, డ్రమ్‌లు తదితర వాటిలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. చేతులను తరచూ శుభ్రంగా కడుక్కోవడం ద్వారా డయేరియా, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులను నివారించవచ్చన్నారు. అలాగే ప్రతి ఇంటిలో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలని, తడి-పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి మున్సిపల్ వాహనానికి అందించాలని కోరారు. ప్రజలందరూ పరిశుభ్రతను అలవర్చుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు బూరుగు లత, కొండ రజిత, తిరుపతి, పూదరి వరప్రసాద్ గౌడ్, కేశవేణి రమేష్, బొల్లి శ్రీనివాస్, కిరణ్ ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ రవికుమార్, జవాన్లు సారయ్య, శ్రీకాంత్, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# కేటీఆర్ అబద్ధాల ప్రచారాన్ని మానుకోవాలి

### కాంగ్రెస్ జిల్లా నాయకులు పచ్చునూరి కరుణాకర్



**భీమదేవరపల్లి జూలై 18 (పీపుల్స్ డైరీ ):** బిఆర్ఎస్ హయాంలో 1.60 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని చెబుతున్న కేటీఆర్ మాటలన్నీ అబద్ధాలని, ఈ ప్రచారాన్ని ఆపాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు పచ్చునూరి కరుణాకర్ అన్నారు. శనివారం ఈ సందర్భంగా మాట్లాడుతూ గత తొమ్మిదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కనీసం 50 వేల ఉద్యోగాలను కూడా సరిగ్గా భర్తీ చేయలేదని, అలాంటిది 1,60,000 ఉద్యోగాలు ఇచ్చామంటూ కేటీఆర్ ఇష్టం వచ్చినట్టు అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేసే హక్కు బిఆర్ఎస్ నేతలకు లేదన్నారు. గత ప్రభుత్వంలో హరీష్ రావు, కవిత, సంతోష్ కుమార్ లు తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకుని ఫామ్ హౌస్ లు కట్టుకున్నారే తప్ప, నిరుద్యోగులను పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. బిఆర్ఎస్ మాయ మాటలను నమ్మే స్థితిలో ప్రజలు లేరని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ తీరు వల్ల యూనివర్సిటీలలో విద్యార్థులు 50 సంవత్సరాల వయసు దాటినా ఉద్యోగాలు లేక తీవ్ర ఆందోళనలకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి కేవలం 30 నెలలు గడుస్తున్నప్పటికీ.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఇప్పటికే 80,000 ఉద్యోగాలను భర్తీ చేసామని ఆయన వెల్లడించారు. నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్న బిఆర్ఎస్ నాయకులు ఇప్పటికైనా అబద్ధాల ప్రచారాన్ని ఆపాలని, లేదంటే ప్రజలే బుద్ధి చెబుతారని పచ్చునూరి కరుణాకర్ హెచ్చరించారు

# అర్చకుల నూతన కమిటీ ఎన్నిక



**భీమదేవరపల్లి జూలై 18 (పీపుల్స్ డైరీ ):** భీమదేవరపల్లి మండల కేంద్రంలోని శ్రీ భీమేశ్వర ఆలయంలో శనివారం దూప దీప నైవేద్య అర్చకుల మండల స్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవ శర్మ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు గణేష్ సిద్ధాంతి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బూరుగుపల్లి అఖిల్ సాయిశర్మ, ఉపాధ్యక్షుడిగా గుడికందుల రమేషాచారి, కార్యదర్శిగా గుండ్ల శ్రీరామ శర్మ, కోశాధికారిగా అనుముల ప్రవీణ్ శర్మ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా కొండ్ర హరీష్, తిముగుల సదాశివశర్మ, శ్రీరామ శర్మ, ఉప్పల కోటిచారి తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులకు సమావేశంలో పాల్గొన్న అర్చకులు అభినందనలు తెలియజేసి, సంఘ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

# బిజెపి అక్కన్నపేట మండల పార్టీ కమిటీ కార్యవర్గం ఎన్నిక

### అక్కన్నపేట బిజెపి మండల అధ్యక్షులు రామంచ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో


Akkannapet Mandal Committee

**అక్కన్నపేట, జులై 18, ( పీపుల్స్ డైరీ):** కేంద్రమంత్రి బండి సంజయన్న ఆశీస్సులతో బిజెపి సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ ఆదేశానుసారంగా జాతీయ & రాష్ట్ర పార్టీ గైడ్ లైన్ ప్రకారం బిజెపి అక్కనపేట మండల పార్టీ కమిటీ కార్యవర్గాన్ని మరియు వివిధ మోర్చాల మండల అధ్యక్షులను తేదీ 18-07-2026 రోజున బిజెపి మండల అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి ప్రకటించడం జరిగింది. వైస్ ప్రెసిడెంట్స్ : సంక్రే సంతోష్, సిరికొండ జగదీశ్వర చారి, భువనగిరి తిరుపతి, గుగు లోతు అర్జున్ నాయక్,. జనరల్ సెక్రటర్స్ : చెరుకు సంపత్, మడక రవికుమార్, వేముల ప్రసాద్, లావుడ్యా రైనా నాయక్, జన్నారపు కళ్యాణం విష్ణు, పంగా శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి: ముక్కిస సమ్మిరెడ్డి, సోషల్ మీడియా జంగపెల్లి శ్రీనివాస్ ఎన్నిక కావడం జరిగింది. ఈ మండల కమిటీ నియామకానికి సహకరించిన బిజెపి రాష్ట్ర నాయకులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి,పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ రావు, అసెంబ్లీ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వేంకటేశం, కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నియామకాలు ఈరోజు నుండి అమల్లోకి వస్తాయి.

# సిద్దిపేటలో 'సీపీ కనెక్ట్' ప్రారంభం

### ఉత్తమ సేవలందించిన పది మంది పోలీస్ సిబ్బందికి సీపీ ప్రశంసలు



**సిద్దిపేట కమిషనరేట్, జూలై 18 :** పోలీస్ సిబ్బందిలో ఉత్తమ సేవలను గుర్తించి, వారి మనోధైర్యాన్ని పెంపొందించేందుకు సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ 'సీపీ కనెక్ట్' అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. విధుల్లో అసాధారణ అంకితభావం, నేరాల ఛేదన, ప్రాణాల రక్షణ, కమ్యూనిటీ పోలీసింగ్, ప్రజల భద్రతలో విశేష ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ప్రతి నెల శనివారం వ్యక్తిగతంగా అభినందిస్తూ ప్రశంసా పత్రాలు అందజేయడం ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా శనివారం కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన తొలి 'సీపీ కనెక్ట్' కార్యక్రమంలో విధుల్లో విశేష ప్రతిభ కనబరిచిన పది మంది పోలీస్ సిబ్బందిని సీపీ ప్రశంసా పత్రాలు, ప్రత్యేక గిఫ్ట్ కిట్‌లతో సత్కరించి, వారితో ముచ్చటించారు. అభినందనలు పొందిన వారు.. రాయ్‌పోల్: ఆత్మహత్యాయత్నాలకు పాల్పడిన నలుగురిని కాపాడిన కానిస్టేబుళ్లు మల్లేష్, నిమ్మ ప్రశాంత్. చేర్యాల: హాస్టల్ నుంచి వెళ్లిపోయిన బాలుడిని సురక్షితంగా గుర్తించి వార్డెన్‌కు అప్పగించిన కానిస్టేబుళ్లు వెంకటేష్, మహేష్. గజ్వేల్: అర్ధరాత్రి ఒంటరిగా తిరుగుతున్న మైనర్ బాలికను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన కానిస్టేబుళ్లు వెంకటేష్, సుధాకర్. రాజ్‌గోపాల్‌పేట: దొంగిలించిన బోర్‌వెల్ వైరుతో ఉన్న అనుమానితుడిని పట్టుకున్న కానిస్టేబుళ్లు ఆనంద్, రవిరాజు. చిన్నకోడూరు: సీసీటీవీ ఆధారంగా దొంగను అరెస్ట్ చేసి రెండు ఆటోలు, రెండు స్కూటర్లను స్వాధీనం చేసుకున్న ఎస్ఐ చంద్రమోహన్, కానిస్టేబుల్ స్వామి. ఈ సందర్భంగా సీపీ రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ 'సీపీ కనెక్ట్' కేవలం అవార్డుల కార్యక్రమం కాదని, నిష్కపటంగా సేవలందిస్తున్న పోలీస్ సిబ్బందిని గుర్తించి ప్రోత్సహించే వేదిక అని అన్నారు. ఇలాంటి గుర్తింపు వల్ల పోలీస్ బలగంలో బాధ్యత, ఉత్సాహం పెరగడంతో పాటు నాయకత్వం-సిబ్బంది మధ్య అనుబంధం మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించే జవాబుదారీతనం కలిగిన, ప్రజా కేంద్రిత పోలీస్ బలగాన్ని నిర్మించడమే 'సీపీ కనెక్ట్' ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కుశాల్కర్, అడిషనల్ డీసీపీ (ఏఆర్) సుభాష్ చంద్రబోస్, ఇన్‌స్పెక్టర్ కిరణ్, పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్ గౌడ్, ఆర్ఎస్ఐ సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# జగన్నాధుని కృపతో సమృద్ధిగా వర్షాలు పడాలి

**జగిత్యాల ప్రతినిధి, జూలై 18:** ఇస్కాన్ వారి ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కేంద్రంలో పార్కు దగ్గర ఏర్పాటు చేసిన జగన్నాథ రథ యాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే జగన్నాధుని కృపతో సమృద్ధిగా వర్షాలు పడాలని, ఎల్ నీనో ప్రభావం త్వరగా తొలగిపోవాలి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సమిండ్ల శ్రీనివాస్, శివ కేసరి బాబు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పీపుల్స్‌డైరీ
వరంగల్
ఆదివారం, 19 జూలై 2026
సంపుటి : 18, సంచిక : 132


## పటాన్చెరు గడ్డపై గులాబీ జెండా హోరు

**జెండా ఊపి ర్యాలీ ప్రారంభించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



**పటాన్చెరు, జూలై 18:** హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన యువ సంగ్రామ సదస్సుకు పటాన్చెరు నియోజకవర్గం నుంచి భారీగా పార్టీ శ్రేణులు తరలివెళ్లాయి. పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి (జీఎంఆర్) నాయకత్వంలో సుమారు 1200 వాహనాల్లో కార్యకర్తలు, యువత, విద్యార్థులు, నిరుద్యోగులు ర్యాలీగా బయలుదేరారు. శనివారం ఉదయం పటాన్చెరు డివిజన్ పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ వద్ద ఎమ్మెల్యే జీఎంఆర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం పటాన్చెరు ప్రధాన రహదారుల గుండా ఓఆర్ఆర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన యూత్ డిక్లరేషన్లో నిరుద్యోగులకు భారీ సంఖ్యలో ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. అయితే ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినా జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఉద్యోగాల కోసం ప్రశ్నిస్తున్న నిరుద్యోగుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి బాధాకరమని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. 2028 ఎన్నికల్లో ప్రజలు తగిన తీర్పు ఇస్తారని, కేసీఆర్ నాయకత్వంలో తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, యువత, విద్యార్థులు, మహిళా, కార్మిక విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి నీటి బొట్టును భూమిలోకి ఇంకించాలి

**ప్రతి గ్రామపంచాయతీలో కనీసం ఆరు ఫామ్‌పాండ్లు ఏర్పాటు చేయాలి- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 18:** జిల్లాలో భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు రైతులకు దీర్ఘకాలిక సాగునీటి వనరులు అందుబాటులోకి తీసుకురావాలంటే వర్షపు నీటి సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి భూమిలోకి ఇంకించేలా వాటర్‌షెడ్ కార్యక్రమాలను శాస్త్రీయంగా, సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. శనివారం కొహీర్ మండలంలోని సజ్జాపూర్, ఖానాపూర్, బడం పేట గ్రామాల్లో పి యం కెఎస్వై పథకం కింద చేపడుతున్న వాటర్‌షెడ్ అభివృద్ధి పనులు, రీఛార్జ్ బోర్‌వెల్ స్ట్రక్చర్లు, పర్‌కొలేషన్ ట్యాంకులు, మినీ పర్‌కొలేషన్ ట్యాంకులు తదితర వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల నాణ్యత, నిర్మాణాల సామర్థ్యం, వర్షపు నీటి నిల్వ విధానాలపై అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షపు నీరు వృథా కాకుండా భూమిలోకి ఇంకేలా ప్రతి గ్రామంలో రీఛార్జ్ నిర్మాణాలను విస్తృతంగా ఏర్పాటు చేయాలని అన్నారు. భూగర్భ జలాల పెరుగుదలకు తోడ్పడే రీఛార్జ్ బోర్‌వెల్ స్ట్రక్చర్లు, పర్‌కొలేషన్ ట్యాంకులు, మినీ పర్‌కొలేషన్ ట్యాంకులు, ఫామ్‌పాండ్లు వంటి నీటి సంరక్షణ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామపంచాయతీలో కనీసం ఆరు ఫామ్‌పాండ్లు ఏర్పాటు చేయాలని, అలాగే ప్రతి రైతు తన వ్యవసాయ భూమిలో ఊట కుంట లేదా పంటకుంట ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించి ప్రోత్సహించాలని సూచించారు. ఈ కుంటల్లో వర్షపు నీరు నిల్వ ఉండటం వల్ల భూగర్భ జలాలు పునరుద్ధరించబడటంతో పాటు అవసరమైన సమయంలో పంటలకు రక్షణాత్మక సాగునీరు అందుతుందని తెలిపారు. వాటర్‌షెడ్ కార్యక్రమాల ద్వారా ముఖ్యంగా హార్టికల్చర్ పంటల విస్తరణకు, ఆరుతడి పంటల సాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఇదే తరహా వాటర్‌షెడ్ అభివృద్ధి పనులను నారాయణఖేడ్, ఆందోల్ జహీరాబాద్, నియోజకవర్గాల్లో కూడా విస్తృతంగ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్శనలో కలెక్టర్ వెంట డీఆర్‌డీఓ (పీడీ) జ్యోతి, సంబంధిత శాఖల అధికారులు, ఎంపీడీవోలు, సాంకేతిక సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్న జిల్లా బాధ్యుడు జి. హరిప్రసాద్




**కరీంనగర్ జిల్లా ప్రతినిధి, జూలై 18 :** హైదరాబాద్ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కరీంనగర్ జిల్లా ముఖ్య నాయకులతో సమావేశం అవడం జరిగింది. అనంతరం పార్టీ చీఫ్ కవితక్క మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన పార్టీ కమిటీలు బూతు స్థాయిలో నిర్మాణం జరగాలని వారు అన్నారు. ప్రజాల సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని వారు కల్పించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్, రాష్ట్ర నాయకులు లింగంపల్లి నాగరాజు, మహిళ అధ్యక్షురాలు అంకం శివరాణి, ఆదివాసి విభాగం జిల్లా అధ్యక్షులు కుతాడి శ్రీనివాస్, మానకొండూరు నియోజకవర్గం ఇంచార్జ్ చెన్నమల్ల చైతన్య, సీనియర్ నాయకులు రంగరవేణి లక్ష్మణ్, భాసవేణి రాజేందర్ నూతి సాయి చరణ్, మ్యాక వినోద్, లింగంపల్లి శ్రీనివాస్, రాకేష్,ఎండి రజి, పూసాల పవన్,ఎండి సల్మా, ఎండి అతహార్, చింతరెడ్డి జైపాల్ రెడ్డి, జంగ అపర్ణ పాల్గొన్నారు.

# ఐకేపీ వీఓఏలకు రూ.26 వేల వేతనం అమలు చేయాలి

- సెర్ప్ సీఈఓ హామీలను వెంటనే అమలు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి
- ఐకెపి జిల్లా అధ్యక్షుడు కిష్టయ్య



**అక్కన్నపేట, జూలై 18, (పీపుల్స్ డైరీ ) :**రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ క్యాంపు కార్యాలయాన్ని శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం (సిద్దిపేట జిల్లా కమిటీ) నాయకులు ముట్టడించి, తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఓఎస్డీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఐకేపీ వీఓఏలకు ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా నెలకు రూ.26వేల వేతనం అమలు చేయడంతో పాటు సెర్ప్ సీఈఓతో జరిగిన చర్చల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత 25 సంవత్సరాలుగా సెర్ప్ సంస్థ ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో మహిళా సంఘాల బలోపేతం, స్వయం సహాయక సంఘాల అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారత కోసం ఐకేపీ వీఓఏలు నిరంతరం సేవలందిస్తున్నారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఐకేపీ వీఓఏలకు నెలకు రూ.18 వేల వేతనం ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా, మూడు బడ్జెట్ సమావేశాలు పూర్తయినా వేతనాల పెంపునకు నిధులు కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు కొత్త కొత్త యాప్‌లు, అదనపు విధులు అప్పగిస్తూ పని భారం పెంచుతున్నారని, కానీ అందుకు తగిన వేతనాలు, సౌకర్యాలు కల్పించడం లేదని పేర్కొన్నారు. రాష్ట్ర యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన దశలవారీ ఉద్యమాల అనంతరం సెర్ప్ సీఈఓతో జరిగిన చర్చల్లో పలు హామీలు లభించాయని, వాటిని వెంటనే వ్రాతపూర్వక సర్క్యులర్ రూపంలో జారీ చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, అర్హులైన వీఓఏలను సీసీలుగా (కమ్యూనిటీ కోఆర్డినేటర్లు) పదోన్నతి కల్పించాలని కోరారు.

**ప్రధాన డిమాండ్లు**

ప్రభుత్వం నుంచి నెలకు రూ.26000 వేతనం అమలు చేయాలి. రూ.10 లక్షల సాధారణ బీమాతో పాటు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలి. సెర్ప్ జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం గ్రామ సంఘాల ద్వారా వేతనాలు పెంచాలి. ప్రతి గ్రామ సంఘానికి ట్యాబ్, నెట్ సౌకర్యం కల్పించాలి. ఆదాయం లేని గ్రామ సంఘాలకు రూ.20 లక్షల ప్రత్యేక నిధి మంజూరు చేయాలి. ఈ ప్రభుత్వం వెంటనే తమ న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సంఘం నాయకులు హెచ్చరించారు.

# చరిత్రను తెలుసుకోవడం, వారసత్వ సంపదను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- 'హెరిటేజ్ ఏపప్రి స్టెప్ 2.0' ప్రదర్శనలో పాల్గొన్న వరంగల్ ఎంపీ డాక్టర్ కావ్య..



**హైదరాబాద్ బ్యూరో, జూలై 18:** ఖాజాగుడా,మహాలక్ష్మి కోర్ట్‌యార్డ్ లో నిర్వహించిన "హెరిటేజ్ ఏప్రి స్టెప్ 2.0" వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రదర్శనలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని చారిత్రక ఆధారాలు, గ్రామాలు, దేవాలయాలు, శాసనాలు, పురాతన కట్టడాలు, పురావస్తు ప్రదేశాలకు సంబంధించిన అరుదైన చారిత్రక విశేషాలను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పరిశీలించారు.

**ఎంపీ డాక్టర్ కావ్య మాట్లాడుతూ**

మన పూర్వీకులు అందించిన అమూల్యమైన చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపదను భావితరాలకు చేరవేయడం మనందరి బాధ్యత అని అన్నారు. చరిత్ర గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, దానిని అధ్యయనం చేయడం ద్వారా సమాజం తన మూలాలను, సంస్కృతిని మరింత లోతుగా అర్థం చేసుకోగలదని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు యువతలో చరిత్ర పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు వారసత్వ పరిరక్షణకు ప్రేరణగా నిలుస్తాయని తెలిపారు. ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ చేపడుతున్న ప్రెజర్వ్ హెరిటేజ్ ఫర్ పోస్టరిటీ (పి.హెచ్.పి) కార్యక్రమం ద్వారా మరుగున పడిన ఎన్నో చారిత్రక, పురావస్తు విశేషాలను వెలుగులోకి తీసుకువస్తున్న ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈ. శివనాగిరెడ్డి కృషిని ఎంపీ ప్రత్యేకంగా అభినందించారు. విలువైన పురాతన సంపదను గుర్తించి, దాని ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేస్తూ చరిత్ర పరిరక్షణకు విశేష సేవలు అందిస్తున్నందుకు ఆయనను కొనియాడారు. ఈ సందర్భంగా డాక్టర్ ఈ. శివనాగిరెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చరిత్రాభిమానులు, పరిశోధకులు, విద్యార్థులు, సాంస్కృతిక రంగ ప్రతినిధులు పాల్గొన్నారు.

# గురుకుల విద్యార్థులే తెలంగాణకు భవిష్యత్ బ్రాండ్ అంబాసిడర్లు

- గురుకులాలే గొప్ప సమాన అవకాశాల వేదిక
- పేద విద్యార్థుల విజయాలే మా ప్రభుత్వానికి నిజమైన పురస్కారం
- నీట్ ర్యాంకర్లు, స్వర్ణ పతక విజేతతో కలిసి ముఖ్యమంత్రిని కలిసిన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి



**హైదరాబాద్ బ్యూరో, జూలై 18 :** పేదరికం ప్రతిభకు ఎప్పుడూ అడ్డంకి కాదని, సరైన అవకాశం, నాణ్యమైన విద్య, ప్రభుత్వ అండ ఉంటే గురుకుల విద్యార్థులు ప్రపంచ స్థాయిలోనూ సత్తా చాటగలరని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఎంసీహెచ్ఆర్డీలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల (టీజీస్వరేస్)లో చదివి నీట్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో పాటు, చైనాలోని ఓర్డోస్‌లో నిర్వహించిన తొలి ఆసియా అండర్-23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2026లో మహిళల 4 ఇంట్ 400 మీటర్ల రిలే పోటీలో భారత జట్టు స్వర్ణ పతకాన్ని కైవసం సాధించిన సాయి ప్రవల్లికతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ "గురుకులాల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి విజయం వెనుక ప్రభుత్వం తీసుకున్న సంస్కరణలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టి, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల విశ్వాసం కలిసి ఉన్నాయి. ఈ విజయాలు ఒక్క విద్యార్థుల కుటుంబాలకు మాత్రమే కాదు, తెలంగాణ సమాజానికే గర్వకారణం" అని అన్నారు. గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం, అత్యాధునిక వసతి, డిజిటల్ విద్య, ఉచిత నీట్, జేఈఈ, సివిల్స్ వంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, సబ్జెక్టు నిపుణుల పర్యవేక్షణను ప్రభుత్వం అందిస్తోందని మంత్రి వివరించారు. "సామాజిక న్యాయం అంటే కేవలం సంక్షేమ పథకాలు మాత్రమే కాదు, పేద పిల్లలను దేశ అత్యున్నత విద్యాసంస్థల్లో చదివించి నాయకత్వ స్థానాలకు తీసుకెళ్లడం కూడా సామాజిక న్యాయమే. అదే దిశగా మా ప్రభుత్వం పనిచేస్తోంది" అని మంత్రి పేర్కొన్నారు. ఆసియా స్థాయిలో స్వర్ణ పతకం సాధించిన సాయి ప్రవల్లికను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. "విద్యతో పాటు క్రీడల్లోనూ గురుకుల విద్యార్థులు ప్రపంచ స్థాయిలో రాణించడం తెలంగాణ గురుకుల విద్యా వ్యవస్థ సామర్థ్యానికి నిదర్శనం. భవిష్యత్తులో మరింత మంది ఒలింపియన్లు, వైద్యులు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, సివిల్ సర్వెంట్లు ఈ గురుకులాల నుంచే రావాలి" అని ఆకాంక్షించారు. "మీరు సాధించిన ర్యాంకు మీ జీవితాన్ని మాత్రమే కాదు, మీ తర్వాత వచ్చే వేలాది మంది పేద విద్యార్థులకు స్ఫూర్తిని ఇస్తుంది. కష్టపడి చదివితే ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల నుంచే దేశ అత్యున్నత స్థానాలకు చేరుకోవచ్చని మీరు నిరూపించారు. మీ విజయ ప్రస్థానంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటుంది" అని ప్రోత్సహిం చారు. "తెలంగాణ ప్రభుత్వం గురుకుల విద్యా వ్యవస్థను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతోంది. పేద విద్యార్థి కల ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నాం. ప్రతి గురుకుల విద్యార్థి విజయం మా ప్రభుత్వ విజయంగా భావించి, వారికి అవసరమైన ప్రతి అవకాశాన్ని కల్పిస్తాం" అని మంత్రి అడ్లూరి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ పిల్లలకు కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, ఉచిత ప్రత్యేక కోచింగ్, అన్ని సౌకర్యాలు కల్పించి వారి కలలను సాకారం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సిడిడి ముఖ్య కార్యదర్శి విజయేంద్ర బోయి, టీజీస్వరేస్ కార్యదర్శి (ఎఫ్ఏసి) కంభంపాటి శారద, జాయింట్ సెక్రెటరీ (అకాడమిక్) సక్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పటాన్చెరులో ఘనంగా పూరి జగన్నాథుడి రథయాత్ర

- మూడు ఎకరాల్లో బాలాజీ, శ్రీకృష్ణ దేవాలయాల నిర్మాణానికి ప్రణాళికలు
- రథయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్చెరు, జూలై 18 :**భక్తుల జయజయ ధ్వనులు, హరినామ సంకీర్తనల నడుమ పటాన్చెరు పట్టణంలో పూరి జగన్నాథుడి రథయాత్ర శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని శ్రీ కోదండ సీతారామ స్వామి దేవాలయం వద్ద హరే రామ హరే కృష్ణ గోల్డెన్ టెంపుల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రథయాత్రను పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి బంగారు చీపురుతో మార్గాన్ని ఊడ్చి, అనంతరం రథాన్ని లాగి ప్రారంభించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించగా, చిన్నారులు, మహిళలు, హరే రామ హరే కృష్ణ గోల్డెన్ టెంపుల్ సభ్యులు భజనలు, కీర్తనలు చేస్తూ పట్టణ ప్రధాన వీధుల గుండా రథయాత్రను ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, పూరిలో జరిగే జగన్నాథుడి రథయాత్ర ప్రపంచంలోనే అత్యంత పురాతన హిందూ ఆధ్యాత్మిక ఉత్సవాల్లో ఒకటని పేర్కొన్నారు. పటాన్చెరులో కూడా అదే భక్తి, వైభవంతో రథయాత్ర నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచిన పటాన్చెరు నియోజకవర్గంలో దేశంలోని 27 రాష్ట్రాల ప్రజలు సోదరభావంతో కలిసి జీవిస్తున్నారని తెలిపారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని బంగారుగడ్డలో మూడు ఎకరాల విస్తీర్ణంలో శ్రీ బాలాజీ దేవాలయం, శ్రీకృష్ణ దేవాలయం నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని వెల్లడించారు. భక్తుల సహాయ సహకారాలతో త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని, భగవంతుని కృపతో ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు శంకర్ యాదవ్, సపాన దేవ్, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, నర్ర బిక్షపతి, పృథ్వీరాజ్, అశోక్, నర్సింలు, చంద్రశేఖర్, మల్లేష్ తదితరులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పంట మార్పిడిపై రైతులకు అవగాహన..

**మండల వ్యవసాయ అధికారి బి.వెంకన్న..**

**కేసముద్రం, జూలై 18(పీపుల్స్ డైరీ) :** వర్షాభావ పరిస్థితుల్లో రైతులు పంట మార్పిడి పై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి బి.వెంకన్న అన్నారు. శనివారం కేసముద్రం మండలంలోని నారాయణపురం గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలోగ్రామ సర్పంచ్ ధరావత్ యమున -సుమన్ నాయక్ అధ్యక్షతన వానకాలం 2026- 27 సీజన్లో సాగు చేసే పంటల మీద వాతావరణ శాఖ ఆదేశాల మేరకు పంట మార్పిడిపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వ్యవసాయ అధికారి వెంకన్న మాట్లాడుతూ రాష్ట్రంలోఎల్నినో ప్రభావం వలన వాతావరణంలో పెను మార్పులు సంబంధించి సకాలంలో వర్షాలు కురిసే అవకాశం లేనందున, సెప్టెంబర్ మాసం చివరివరకు వర్షపాతం తక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉన్నందున రైతు సోదరులు నీటి వసతి కింద సాగు చేసే వరిని తగ్గించి, బోర్ల కింద, బావుల కింద, చెరువుల కింద, వరి విస్తీర్ణాన్ని తగ్గించి పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలన్నారు. మెట్ట పంటలు, తక్కువ నీటితో సాగుచేసే పెసర, మినుములు,కందులు జొన్నలు, సజ్జలు, రాగులు, కూరగాయల పంటల సాగులను సాగు చేసి నష్ట నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. వర్షాకాలం సీజన్ లో వేసినటువంటి పత్తి మొక్కజొన్న, పంటలకు అడపాదనప నీటి తడులు ఇచ్చి పంటలను రక్షించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ గుగులోత్ లచ్చు, ఇరిగేషన్ శాఖ అధికారి విజయ్ , మండల వ్యవసాయ విస్తరణ అధికారి రాజీవ్ లోచన్ ,వార్డు సభ్యులు జాటోత్ వీరన్న, బానోత్ నవీన నరేష్,గ్రామ పెద్దలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య పాఠశాలలో స్కూల్ కౌన్సిల్ ఎన్నికలు



**హనుమకొండ, జూలై 18 (పీపుల్స్ డైరీ) :** హనుమకొండలోని నక్కలగుట్టలో గల శ్రీ చైతన్య పాఠశాల-4లో శనివారం స్కూల్ కౌన్సిల్ ఎలక్షన్ నిర్వహించారు. విద్యార్థులను నాలుగు విభాగాలుగా విభజించి విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు పెంపొందించడం కోసం ఎలక్షన్స్ నిర్వహించారు. రాయల్స్, సీజర్స్, కింగ్స్, పారోస్ పేర్లతో విద్యార్థుల చేత నామినేషన్ వేయించి ఎలక్షన్స్ నిర్వహించారు. ఈ ఎలక్షన్స్‌లో ఆరవ తరగతి నుండి తొమ్మిదవ తరగతి వరకు విద్యార్థిని విద్యార్థులు పాల్గొని తమ ఓటును ఉపయోగించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపల్ సీమ మాట్లాడుతూ... విద్యార్థిని విద్యార్థులు విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలు పెంపొందించడం, ఓటు ప్రాముఖ్యత, ఓటు వేసే విధానం విద్యార్థులు తెలుసుకోవడం కోసం ఎలక్షన్స్ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్లంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, డీజీఎం చేతన్, ఏ.జి.ఎం మనోహర్, కోఆర్డినేటర్ శివ కోటేశ్వరరావు, ప్రిన్సిపల్ సీమ పాఠశాల ఇన్చార్జి నాగార్జున్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ స్పృహ చాటుకున్న జీవశాస్త్ర ఉపాధ్యాయులు

**ఉపాధ్యాయుల డైరీ ఆవిష్కరించిన డీఈఓ**



**గణపురం, జూలై 18 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ లో గత మూడు రోజులు పాటు జరుగుతున్న జీవశాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణ శనివారం ముగింపు కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, ఏఎంఓ పింగళి విజయపాల్ రెడ్డి, సీఎంఓ సామల రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డీఈఓ రాజేందర్ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాల స్థాయిలో అమలు చేయాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, సైన్స్ ల్యాబ్‌ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.మూడు రోజుల పాటు ఉపాధ్యాయులు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు వాడి ప్లాస్టిక్, పేపర్ వాడకాన్ని తగ్గించి. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం తెలంగాణ బయోలాజికల్ సైన్స్ ఫోరం జిల్లా ఆధ్వర్యంలో తయారు చేసిన జీవశాస్త్ర ఉపాధ్యాయుల డైరీని ఆవిష్కరించారు.ఈ శిక్షణలో జిల్లాలోని 60 మంది జీవశాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి : డీఎంహెచ్ఓ

**గణపురం పీహెచ్‌సీ తనిఖీ చేసిన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి మధుసూదన్**





**గణపురం, జూలై 18 (పీపుల్స్ డైరీ) :** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ సూచించారు. శనివారం గణపురం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ల్యాబ్, వ్యాక్సిన్ రూమ్, ఫార్మసీని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అవసరమైన మందులు, వైద్య సామగ్రి కొరత లేకుండా చూడాలని సూచించారు. డెంగీ, మలేరియా, వైరల్ ఫీవర్ వంటి సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు హెల్త్ క్యాంపు లోను నిర్వహించాలని సూచించారు. అనంతరం గణపురం--1 సబ్ సెంటర్‌ను సందర్శించి అక్కడి వైద్య సేవలను పరిశీలించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే అన్ని రకాల వ్యాక్సిన్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని, టీకాల కార్యక్రమాన్ని నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరికీ సకాలంలో టీకాలు అందేలా క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ తనిఖీలో డాక్టర్ అనూష, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఖాజీపేట దర్గా ఉర్స్ ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

**జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న**



**మట్టెవాడ, జూలై 18 (పీపుల్స్ డైరీ):** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వెంకన్న శనివారం నగరంలో కొనసాగుతున్న, చేపట్టబోయే పలు అభివృద్ధి పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా పనుల పురోగతిని సమీక్షిస్తూ, నాణ్యతతో పాటు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ముందుగా హనుమకొండ బస్ స్టేషన్ పునరుద్ధరణ పనులను పరిశీలించిన కమిషనర్, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అవసరమైన సాంకేతిక సూచనలు చేస్తూ, పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ ఉండరాదని స్పష్టం చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం పరిసరాలను సందర్శించి, జేబీఎస్ బస్ స్టేషన్ వద్ద పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని స్టేడియం రహదారి విస్తరణ పనులను పరిశీలించారు. ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా రహదారి విస్తరణ పనులను త్వరితగతిన చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. హనుమకొండ అశోక థియేటర్ ఎదురుగా ప్రతిపాదించిన మల్టీ లెవల్ పార్కింగ్ స్థలాన్ని పరిశీలించిన కమిషనర్ టెండర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి, పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆగస్టు నెలలో నిర్వహించనున్న ఖాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాల నేపథ్యంలో కమిషనర్ వెంకన్న, దర్గా పీఠాధిపతి అఫ్జల్ బియాబానీ ఖుస్రో పాషాతో కలిసి దర్గా ప్రాంగణం, పరిసర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ వెలుగులు, రహదారుల మరమ్మతులు, ఇతర మౌలిక సదుపాయాలను ముందస్తుగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పరిశీలనలో సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజ్ కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో వీధిదీపాల నిర్వహణను మరింత పటిష్ఠం చేయాలి!

**జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న**



**మట్టెవాడ, జూలై 18 (పీపుల్స్ డైరీ) :** గ్రేటర్ వరంగల్ నగర పరిధిలో వీధిదీపాల నిర్వహణ, విద్యుత్ విభాగం పనులు సమర్థవంతంగా నిర్వహించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. శనివారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్ తో కలిసి ఎలక్ట్రికల్ విభాగం పనులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో వీధిదీపాల నిర్వహణ, పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో తాత్కాలిక విద్యుత్ అలంకరణల ఏర్పాటు, సెంట్రల్ కంట్రోల్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ (సిసిఎంఎస్) బాక్సుల నిర్వహణ, ఎలక్ట్రికల్ మెటీరియల్ సకాలంలో కొనుగోలు, మ్యాన్‌పవర్ వినియోగం, నిర్వహణ పనుల పురోగతిపై కూలంకషంగా సమీక్షించారు. అన్ని ప్రాంతాల్లో వీధిదీపాలు నిరంతరం పనిచేసేలా పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని, లోపాలు గుర్తించిన వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. అవసరమైన ఎలక్ట్రికల్ సామగ్రి అందుబాటులో ఉండేలా ముందస్తు ప్రణాళికతో కొనుగోళ్లు చేపట్టాలని, పండుగల సందర్భంగా తాత్కాలిక లైటింగ్ ఏర్పాట్లను నాణ్యతా ప్రమాణాలతో సురక్షితంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మాధవిలత, రవికుమార్, అసిస్టెంట్ ఇంజనీర్లు అబ్దుల్ గఫూర్, సరిత, రామ్‌కీతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## 20న ఓరుగల్లులో జగన్నాథ రథయాత్ర



**మట్టెవాడ, జూలై 18 (పీపుల్స్ డైరీ):** ఈనెల 20వ తేదీ సోమవారం జగన్నాథ రూపంలో ఉన్న శ్రీకృష్ణుడి భారీ రథ యాత్ర ఓరుగల్లులో అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) వరంగల్ సంస్థ ప్రతినిధి మురళీ వర్ధన్ కృష్ణదాస్ వెల్లడించారు. రథయాత్ర మధ్యాహ్నం ఒంటిగంటకు అతిథుల ప్రసంగాలు, జగన్నాథ హారతి అనంతరం హన్మకొండ పబ్లిక్ గార్డెన్ నుంచి మహిళలు, శ్రీకృష్ణ భక్తుల కోలాటాలు, నృత్యాల నడుమ ప్రారంభం అవుతుందన్నారు. పబ్లిక్ గార్డెన్ నుంచి మొదలై హన్మకొండ చౌరస్తా, అలంకార్ జంక్షన్, ములుగు రోడ్, ఎంజిఎం జంక్షన్, పోచమ్మ మైదాన్ జంక్షన్ చేరుకొని తిరిగి అక్కడినుంచి ఎంజిఎం జంక్షన్ మీదుగా సాయంత్రం 6 గంటలకు వెంకటేశ్వర గార్డెన్ కు చేరుకుంటున్నారు. పరమ పవిత్రంగా అత్యంత భక్తి శ్రద్ధలతో ఊరేగింపుగా కొనసాగే రథయాత్రలో జగన్నాథుని దర్శించినా, రథాన్ని లాగినా పునర్జన్మ ఉండదని పురాణాల్లో చెప్పడం గమనార్హం. సాయంత్రం వెంకటేశ్వర గార్డెన్ లో కీర్తనలు, భజనలు, అతిథుల ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మహా హారతి తదుపరి హాజరైన భక్త జనానికి మహాప్రసాద వితరణ ఏర్పాటు చేయడం జరిగిందని మురళీ కృష్ణదాస్ వివరించారు. సుమారు 10 కిలోమీటర్ల మేర కొనసాగే ఈ రథయాత్ర దారి పొడవునా భక్తులకు పులిహోర, హల్వా కప్పులు, స్వామివారి ప్రసాదం ప్యాకెట్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. త్రినగరిలోని భక్తులు అధిక సంఖ్యలో రథయాత్రలో పాలు పంచుకొని జగన్నాథ స్వామి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. అంతకుముందు రథయాత్ర కార్యక్రమ కరపత్రాలను ఇస్కాన్ సంస్థ వరంగల్ ప్రతినిధులు విడుదల చేశారు. ఈ విలేకరుల సమావేశంలో భూపవన హరినామ దాస్, చిట్ట హరిగోపాల దాస్, విజయీ రఘునాథ దాస్, కరుణామయ కృష్ణమూర్తి దాస్ తదితరులు పాల్గొన్నారు.

## దళితులకు 50 ఏండ్లకే పింఛన్లు ఇవ్వాలి



**చిట్యాల, జూలై 18 (పీపుల్స్ డైరీ) :** దళితులకు 50 ఏండ్లకే చేయూత వృద్ధాప్య పింఛన్లు ఇవ్వాలని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ దళిత కుటుంబాలు ఇంకా పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందలేదని అదేవిధంగా ఏండ్ల తరబడి వెట్టి చాకిరీ పనులు చేసి ఆర్థికంగా దళిత కుటుంబాల్లోని వృద్ధులు కనీస అవసరాల కోసం ఇబ్బందులు పడుతున్నారని వారు కనీస అవసరాలు తీర్చుకోలేని స్థితిలో ఉన్నారని ప్రభుత్వం ఆలోచన చేసి దళితుల్లో 50 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి చేయూత పింఛన్లు మంజూరు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కలుషిత ఆహార పదార్థాలు వాతావరణం వలన సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు సరియైన ఆహార పదార్థాలు తీసుకోకపోవడం వలన అనారోగ్యంతో 45 నుండి 50 సంవత్సరాల వరకే వృద్ధాప్య లక్షణాలు వస్తున్నాయని దీంతో వారు ఎటువంటి కూలీ పనులు చేయలేక ఇంటి వద్దనే ఉండడం వలన వారు కనీస అవసరాలు తీర్చుకోలేని పరిస్థితిలో ఉన్నారని తెలిపారు. ప్రభుత్వాలు స్పందించి 50 ఏళ్లు నిండిన ప్రతి దళితునికి చేయూత పింఛన్లు అందించి ప్రజాస్వామ్య యుతంగా వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



**చిట్యాల, జూలై 18 (పీపుల్స్ డైరీ) :** చిట్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటీ సిబ్బంది భూపాలపల్లి శాసనసభ్యులు హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ కమిటీ చైర్మన్ గండ్ర సత్యనారాయణ రావు కు సిబ్బంది పలు సమస్యలపై శనివారం వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు హాస్పిటల్ సిబ్బంది తెలిపారు.

# తెలుగు భాష ఆర్పీలకు ఘన సన్మానం



**రేగొండ, జూలై 18 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ ఉన్నత పాఠశాలలో మూడు రోజులపాటు నిర్వహించిన తెలుగు భాష ఉపాధ్యాయుల వృత్త్యంతర శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన రిసోర్స్ పర్సన్లకు జిల్లా తెలుగు ఫోరం ఆధ్వర్యంలో శనివారం ఘన సన్మానం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా తెలుగు ఫోరం అధ్యక్షుడు సూదమల్ల మురళి మాట్లాడుతూ మారుతున్న విద్యా విధానాలకు అనుగుణంగా తెలుగు భాష బోధనలో నూతన పద్ధతులు, కృత్రిమ మేధస్సు, సాంకేతికత వినియోగం, ఉపాధ్యాయుడు-విద్యార్థి మధ్య సమర్థవంతమైన అభ్యాస ప్రక్రియ వంటి అంశాలపై మూడు రోజులపాటు నిర్వహించిన శిక్షణ ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా ఉపాధ్యాయులు ఆధునిక బోధనా నైపుణ్యాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించే అవకాశాన్ని పొందారని పేర్కొన్నారు. అనంతరం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు దేవేందర్ మాట్లాడుతూ తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడుతూ ఆధునిక సాంకేతికతతో బోధనను మరింత ప్రభావవంతంగా తీర్చిదిద్దాల్సిన అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో వచ్చే నెలలో పదవీ విరమణ చేయబోతున్న జగ్గయ్యపేట ఉన్నత పాఠశాల తెలుగు భాష బోధకులు చికోటి శ్రీనివాస్‌కు ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని తెలుగు ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించారు. శిక్షణను విజయవంతంగా నిర్వహించిన రిసోర్స్ పర్సన్లు, సుధాకర్, చంద్రమౌళి (డీఆర్పీలు)లను జిల్లా తెలుగు ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గట్టు రఘు, కె.రమేష్, శ్రీనివాసాచార్యులు, సాంబయ్య, గడ్డం శంకర్, కుక్కల పున్నం, రిసోర్స్ పర్సన్‌లు నరసింహస్వామి బానోతు రాజు తదితరులు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి

## అంజనాపురంలో ముఖ్యమంత్రి పర్యటన సభా ప్రాంగణాన్ని, హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించనున్న ముఖ్యమంత్రి**

**ప్రోటోకాల్‌కు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి**

**మినిట్ టు మినిట్ కార్యక్రమ షెడ్యూల్‌ను ఖచ్చితంగా అమలు చేయాలి**

**వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా పార్కింగ్ ప్రణాళిక రూపొందించాలి**

**ఖమ్మం, జూలై 18 (పీపుల్స్ డైరీ) :** గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఖమ్మం జిల్లాకు విచ్చేయనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. వైరా నియోజకవర్గం కొణిజెర్ల మండలం అంజనాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి విచ్చేయనున్న సందర్భంగా పర్యటన ఏర్పాట్లు సభా ప్రాంగణం, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రాంతాలు, ఇతర ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శనివారం పరిశీలించి గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ, సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ... కార్యక్రమంలో ప్రోటోకాల్‌కు అనుగుణంగా సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, ప్రతి గ్యాలరీకి స్పష్టమైన గుర్తింపు బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేయాలని, వీఐపీ పాస్‌లను అవసరానికి మించి జారీ చేయరాదని స్పష్టం చేశారు. సభా వేదికను సుమారు 100 మంది బరువును తట్టుకునే విధంగా నిర్మించాలని, అయితే ప్రోటోకాల్ ప్రకారం డయాస్‌పై సీట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మినిట్ టు మినిట్ కార్యక్రమ షెడ్యూల్ ను ముందుగానే సిద్ధం చేసి, ప్రతి శాఖ అదే ప్రకారం బాధ్యతలు నిర్వహించేలా చూడాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పోలీసు శాఖ అత్యంత పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, హెలిప్యాడ్, సభా ప్రాంగణం, రాకపోకల మార్గాలు, పార్కింగ్ ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. మీడియా, అధికారులు, వీఐపీలు, వీవీఐపీలకు వేర్వేరు ప్రవేశ మార్గాలు ఏర్పాటు చేయాలని, సభా ప్రాంగణంలో అవసరమైన బారికేడింగ్‌ను పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రభుత్వ వాహనాలు, వీఐపీ వాహనాలు, ఇతర వాహనాలకు వేర్వేరుగా పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గోద్రెజ్ సంస్థ తరపున కార్యక్రమంలో ప్రసంగించే ప్రతినిధి వివరాలను ముందు గానే ఖరారు చేసి సంబంధిత అధికారులకు తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆడియో, వీడియో ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదని, గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ వీడియోతో పాటు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వీడియోలను కార్యక్రమంలో ప్రదర్శించే అంశాన్ని రెవెన్యూ డివిజనల్ అధికారి తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ప్రారంభోత్సవ సభకు హాజరయ్యేవారందరికీ స్పష్టంగా కనిపించేలా అవసరమైన ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సభా ప్రాంగణంలో పారిశుద్ధ్య నిర్వహణను జిల్లా పంచాయతీ అధికారి నిరంతరం పర్యవేక్షించాలని, ముఖ్యమంత్రి, మంత్రులకు అందించే ఆహార నాణ్యతను ఆహార తనిఖీ అధికారి స్వయంగా తనిఖీ చేసి ధృవీకరించాలని ఆదేశించారు. కార్యక్రమానికి అవసరమైన సురక్షిత త్రాగునీటిని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యనిర్వాహక ఇంజనీర్ సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రోటోకాల్‌కు అనుగుణంగా వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, అత్యవసర వైద్య బృందాలు, అంబులెన్స్‌లు, అవసరమైన వైద్య పరికరాలు సిద్ధంగా ఉండేలా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమం అంతటా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా తగినంత ఇంధనంతో స్టాండ్‌బై జనరేటర్లను కూడా సిద్ధంగా ఉంచాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. గోద్రెజ్ అగ్రోవెట్ సంస్థ ప్రతినిధులతో అన్ని శాఖల అధికారులు నిరంతరం సమన్వయం చేసుకుంటూ తమకు అప్పగించిన బాధ్యతలను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస్, పోలీసు అధికారులు, ఆర్ అండ్ బి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ముహమ్మద్ ముజాహిద్, డివైఎస్‌ఓ సునీల్ రెడ్డి, ఫుడ్ సేఫ్టీ అధికారి, డీపీఓ రాంబాబు, ఉద్యానవన శాఖ అధికారి అనిత, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, గోద్రెజ్ అగ్రోవెట్ సంస్థ ప్రతినిధులున్నారు.



## ప్రజా పాలన స్వర్ణ యుగం

### రాష్ట్ర నాయకులు సతీష్

**చిట్యాల, జూలై 18 (పీపుల్స్ డైరీ) :** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పాలన స్వర్ణ యుగాన్ని తలపిస్తుందని అన్ని వర్గాలకు న్యాయం చేస్తుందని సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజలు మెచ్చిన పాలన అందిస్తుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దాసారపు సతీష్ అన్నారు. శనివారం ఆయన టేకుమట్ల మండల కేంద్రంలో మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి పాలన లో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పనులతో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు సాగుతుందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో మంచి సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ అర్హులకు న్యాయం చేస్తుందన్నారు. నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి ఎమ్మెల్యే సత్తన్న కృషి చేస్తున్నారని తెలిపారు.

## అప్పుల బాధతో రైతు బలవన్మరణం



**గణపురం, జూలై 18 (పీపుల్స్ డైరీ) :** అప్పుల భారంతో మనస్తాపానికి గురైన రైతు పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన గణపురం మండలం కర్కపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పెంతల సమ్మిరెడ్డి (55) తన మూడు ఎకరాలతో పాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి, వరి సాగు చేశాడు. నీటి కొరతతో పత్తి పంట ఎండిపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై శుక్రవారం పురుగుల మందు తాగాడు. గ్రామస్తులు వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నీట్ ఫలితాలలో శివాని విశ్వరూపం!



పి. శ్రీవాణి 472/720



బి. స్వాతి465/720



జి.హనిష్క 454/720



బి.వంశీకృష్ణ437/720

హన్మకొండ, జూలై 18 (పీపుల్స్ డైరీ) : ప్రతిభావంతులైన విద్యార్థులను ర్యాంకర్లుగా తీర్చిదిద్దడం అందరికి సాధ్యమే. కానీ సాధారణ విద్యార్థులను ర్యాంకర్లుగా తీర్చిదిద్దడం శివానికే సాధ్యం. ఇటీవల ప్రకటించిన నీట్ -2026 ఫలితాలలో శివాని జూనియర్ కళాశాల విద్యార్థులు మరోసారి విజయ దుందుభి మోగించారు. కళాశాలకు చెందిన విద్యార్థులు పి. శ్రీవాణి 472/720 ర్యాంకు, బి. స్వాతి465/720 ర్యాంకు, జి.హనిష్క 454/720 ర్యాంకు, బి.వంశీకృష్ణ437/720 ర్యాంకు గత కొన్ని సంవత్సరాలుగా కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా ఫలితాలను సాధిస్తూ ఇటీవల ప్రకటించిన నీట్-2026 ఫలితాలలో వీరితో పాటుగా సుమారు 12 మంది ఎక్కువ మార్కులు సాధించిన శివాని విద్యార్థిని విద్యార్థులకు కళాశాల కరస్పాండెంట్ టి.స్వామి. ప్రిన్సిపల్స్ జి.సురేందర్ రెడ్డి, వి.చంద్రమోహన్, డైరెక్టర్లు టి. రాజు.ఎన్. రమేష్.ఎ. మురళీధర్,వి. సురేష్,ఎస్. సంతోష్ రెడ్డి, అభినందనలు తెలిపారు. ఈ విజయానికి సహకరించిన కళాశాల అధ్యాపకులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలియజేసారు.

# పాఠశాల పురోభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం తప్పనిసరి






**చిట్యాల, జూలై 18 (పీపుల్స్ డైరీ) :** విద్యార్థులకు కుటుంబమే మొదటి బడి అని తల్లిదండ్రులే తొలి గురువులని తమ విద్యార్థుల యొక్క విద్య కార్యకలాపాల్లో తల్లిదండ్రుల ప్రమేయం ఉండాలని పాఠశాల పురోభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం తప్పనిసరి అని మండల విద్యాశాఖ అధికారి కోడెపాక రఘుపతి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జెడ్పి హైస్కూల్లో పేరెంట్స్ టీచర్స్ మీటింగు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ విద్యార్థులకు చదువులో గానీ వ్యక్తిగత విషయాలలో గాని ఏమైనా సమస్యలు ఉంటే వాటిని ముందుగానే గుర్తించి సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తున్నామన్నారు. అలాగే విద్యార్థి ఎదుగుదలకు పాఠశాల ఎంత ముఖ్యమో ఇంటి దగ్గరి పాజిటివ్ వాతావరణం కూడా అంతే ముఖ్యమన్నారు. విద్యార్థుల విద్య తదితర కార్యకలాపాల్లో తల్లిదండ్రుల ప్రమేయం ఉండాలని విద్యార్థులు ఎక్కువగా మొబైల్ టీవీలకు ఆకర్షితులు కాకుండా తల్లిదండ్రులు చూడాలన్నారు. పాఠశాలలో ప్రతి ఉపాధ్యాయుడు మంచి విద్యను విద్యార్థులకు అందించడంతోపాటు నైతిక విలువలు క్రమశిక్షణ సంస్కారం నేర్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి హెడ్మాస్టర్ నీలిమరెడ్డి, బుర్ర సదయ్య, రామ్ నారాయణ, ఉపాధ్యాయులు కల్పన, సుజాత, విజయలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ సాంబమూర్తి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసుల్లో వాహనదారులకు జరిమాన

## ప్రాసిక్యూషన్‌కు సహకరించిన అధికారులను అభినందించిన పోలీస్ కమిషనర్



**ఖమ్మం, జూలై 18 (పీపుల్స్ డైరీ) :** ఖమ్మం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు చేసిన 46 డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసులలోని వాహనదారులకు ఒక్కొరికి 10 వేల రూపాయల చొప్పున నాలుగు లక్షల అరవై వేల రూపాయల జరిమానా విధిస్తూ స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి బి.నాగలక్ష్మి తీర్పు చెప్పారు. ఈ సందర్భంగా ఖమ్మం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బెల్లం సత్యనారాయణ మాట్లాడుతూ... మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు, ప్రాణనష్టం సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ప్రజలు తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా దృష్టిలో ఉంచుకొని మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించి, సురక్షితమైన రహదారి ప్రయాణానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రాసిక్యూషన్‌కు సహకరించిన అధికారులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

# చౌకబారు విమర్శలు మానుకోవాలి

## జోగంపల్లి సర్పంచ్ మారబోయిన ప్రభాకర్



**శాయంపేట, జూలై 18 (పీపుల్స్ డైరీ) :** గత వారం రోజుల కిందటే చలివాగు నుండి నీటిని విడుదల చేయడం జరిగిందని, బీఆర్ఎస్ నాయకులకు కనీస అవగాహన లేకుండా మాట్లాడడం విడ్డూరమని జోగంపల్లి సర్పంచ్ మారబోయిన ప్రభాకర్ అన్నారు. చలివాగు గేట్లుఎత్తాలని బీఆర్ఎస్ నాయకులుడిమాండ్ చేసిన నేపథ్యంలో చలివాగు ప్రాజెక్టు ఉన్న జోగంపల్లి శివారు సర్పంచ్ ప్రభాకర్ శనివారం మాట్లాడారు. ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు ఇబ్బంది తలెత్తకూడదని అధికారులతో మాటాడి నీటిని ఎత్తివేసే మోటార్‌ను బంద్ చేయించిన ఘనత భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుదే అని అన్నారు. రైతులు ధర్నా చేసినప్పుడు 10 అడుగుల నీరు ఉంటే మోటార్ బంద్ చేయడం వల్ల ప్రస్తుతం 13 అడుగుల కు పెరిగిందన్నారు. రైతు పక్షపాతి ఎమ్మెల్యే గండ్ర సత్తన్న అని స్పష్టం చేశారు. తూము నుండి నారుమల్లకు నీరు అందుతున్నాయని, పంటలకు నీరు అందేవిధంగా మున్ముందు ప్రాజెక్టు లో లెవెల్స్ పెరిగే విధంగా చర్యలు తీసుకుంటారని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు చౌకబారు విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. రైతులతో రాజకీయం తగదని అన్నారు. ప్రతిపక్షంగా సమస్యలపై ప్రశ్నిచాలే తప్ప అవగాహన లేకుండా మాట్లాడడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కౌటం లక్ష్మీనారాయణ, రాజేందర్, అశోక్, గణేష్ రైతులు పాల్గొన్నారు.

# బాధ్యతలు స్వీకరించిన విద్యుత్ శాఖ నూతన ఏఈ



**మొగుళ్ళపల్లి, జూలై 18 (పీపుల్స్ డైరీ) :** మండల విద్యుత్ శాఖ నూతన ఏఈగా గుగులోత్ నగేష్ శనివారం విద్యుత్ శాఖ కార్యాలయంలోని తన చాంబర్ లో బాధ్యతలను స్వీకరించారు. గతంలో భూపాలపల్లి రూరల్ ఇంజనీర్ గా విధులను నిర్వహించిన ఆయన మొగుళ్ళపల్లి విద్యుత్ శాఖ ఏఈగా పదోన్నతి పొందారు. గతంలో ఇక్కడ సబ్ ఇంజనీర్ గా పని చేసిన సంజయ్ గత నెలలో విద్యుత్ శాఖ ఏఈగా పదోన్నతి పొంది బదిలీపై భూపాలపల్లికి వెళ్లారు. కాగా నూతనంగా మొగుళ్ళపల్లి విద్యుత్ శాఖ ఏఈగా బాధ్యతలను చేపట్టిన గుగులోతు నగేష్ ను విద్యుత్ శాఖ సిబ్బంది శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫోర్ మెన్ యాదగిరి, టీఆర్వీకెఎస్ జిల్లా నాయకులు శ్రీనివాస్ నాయక్,లైన్ ఇన్స్పెక్టర్ దశరథం లైన్మెన్లు మచ్చ సత్యం, శ్రీనివాస్, అనిల్, ఏఎల్ఎంలు రమేష్, సంపత్ రావు, మహిపాల్, శ్రీనివాస్, శంకర్, ఆన్ మ్యాన్డ్ వర్కర్స్ వేముల కిరణ్ గౌడ్, నరేష్, యుగంధర్, స్పాట్ బిల్లర్లు ప్రసాద్, రాజ్ కుమార్, ఆర్టిజన్ కార్మికులు పాల్గొన్నారు.


# కేటీపీపీలో 23వ రోజు కొనసాగిన నిరసన




**గణపురం, జూలై 18 (పీపుల్స్ డైరీ) :** వైటీపీఎస్‌లో బొగ్గు, బూడిద విభాగాల నిర్వహణను 255 కోట్ల వ్యయంతో మూడు సంవత్సరాల పాటు ప్రైవేటీకరణకు అప్పగించే టెండర్ ప్రక్రియను చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ కేటీపీపీలో టీజీపిఈ జెఏసి పిలుపు మేరకు శనివారం 23వ రోజు విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రధాన గేటు ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యుత్ సంస్థల్లో కీలకమైన ఆపరేషన్ విభాగాలను ప్రైవేటీకరించడం వల్ల ఉద్యోగ భద్రత దెబ్బతినడమే కాకుండా, పనిభారం అసమానంగా పెరగడం, అనుభవజ్ఞులైన సిబ్బందిని పక్కన పెట్టడం, భద్రతా ప్రమాణాలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బొగ్గు, బూడిద ప్రైవేటీకరణ టెండర్ ప్రక్రియను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా రంగ సంస్థలను బలోపేతం చేయాల్సిన సమయంలో ప్రైవేటీకరణ చర్యలు సంస్థ భవిష్యత్తుకు, కార్మికుల హక్కులకు విరుద్ధమని ఆవేదన వ్యక్తం చేశారు.జఇది కేవలం ఒక ప్లాంట్‌కు సంబంధించిన సమస్య మాత్రమే కాదని, రాబోయే రోజుల్లో విద్యుత్ రంగంలో మరిన్ని విభాగాలను అవుట్‌సోర్సింగ్ లేదా ప్రైవేటీకరణ పేరుతో బలహీనపరిచే ప్రయత్నాలకు ఇది నాంది కావచ్చన్నారు. యాజమాన్యం తమ డిమాండ్ లను పట్టించుకోకపోతే రాబోయే రోజుల్లో మరింత ఉధృతమైన ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అన్ని యూనియన్ల ఇంజనీర్స్ అసోసియేషన్ ల ప్రతినిధులు, ఉద్యోగులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# కేటీపీపీ గేటు వద్ద ఘోర ప్రమాదం

## బొగ్గు లారీ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు - మహిళ పరిస్థితి విషమం



**గణపురం, జూలై 18 (పీపుల్స్ డైరీ) :** కేటీపీపీ మూడో గేటు వద్ద శనివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పరకాల--భూపాలపల్లి 353 జాతీయ ప్రధాన రహదారిపై విద్యుత్ ప్లాంట్‌కు బొగ్గు తరలిస్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ధర్మరావుపేట గ్రామానికి చెందిన ఆకుల విజయ, ఆకుల సుశాంత్ (తల్లి కుమారుడు) ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, కేటీపీపీ వైపు వెళ్తున్న బొగ్గు లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా, మహిళ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను ప్రైవేట్ వాహనంలో జిల్లా కేంద్రంలోని వంద పడకల ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో కేటీపీపీ మూడో గేటు ప్రాంతంలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

# చిట్యాలలో సదరం క్యాంప్ ఏర్పాటు చేయాలి : మల్లేష్



**చిట్యాల, జూలై 18 (పీపుల్స్ డైరీ) :** చిట్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో వికలాంగుల వైకల్య నిర్ధారణ కోసం సదరం క్యాంపును ఏర్పాటు చేయాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా ఉమ్మడి చిట్యాల మండలంలో సదరం క్యాంపులు నిర్వహించకపోవడం వలన అనేకమంది వికలాంగులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూపాలపల్లి వరంగల్ లాంటి పట్టణాలకు వెళ్లాలంటే వికలాంగులు నానా ఇబ్బందులు పడుతూ ఆర్థికంగా మానసికంగా నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రజా ప్రతినిధులు అధికారులు వెంటనే స్పందించి చిట్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సదరం క్యాంపు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

## మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం), జూలై 18 (పీపుల్స్ డైరీ) :** ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది భుక్యా రవి నాయక్ కుటుంబ సభ్యులను ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య వారి స్వగృహంలో పరామర్శించారు. రవి నాయక్ చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రవి నాయక్ సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, ఇల్లందు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మండల రాంమహేష్, కాంగ్రెస్ నాయకులు పూనెం సురేందర్, తాటి భిక్షం తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం

### 11వ వార్డులో గృహాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య



**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) జూలై 18 (పీపుల్స్ డైరీ) :** అర్హులైన ప్రతి పేద కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లను అందజేస్తామని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. స్థానిక 11వ వార్డు వెంగలరావు కాలనీలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో ఇల్లందు నియోజకవర్గంలో సుమారు 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, కో–ఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి, మున్సిపల్ కమిషనర్ సందీప్, ఏఈ స్వాతి, వార్డ్ ఆఫీసర్ మమత, కౌన్సిలర్లు నిరుడు ఉపేంద్ర, సోనిబాయి కోరి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొల్లా సూర్యం, మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు స్వరూప, సర్పంచ్ శారద, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గోచికొండ శ్రీదేవి, శివరాత్రి ఎల్లయ్య, లుకేశ్ సుదర్శన్ కోరి, శివలాల్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన గ్రామాల్లో కమ్యూనిటీ కనెక్ట్



**కరకగూడెం, జూలై 18(పీపుల్స్ డైరీ) :** కరకగూడెం పోలీసుల ఆధ్వర్యంలో గిరిజన గ్రామాల్లో కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన రాబిన్ హుడ్ స్వచ్ఛంద సంస్థ తరఫున నీలాద్రిపేట, గండి, అశ్వాపురంపాడు, గుత్తికోయ గ్రామాల్లోని గిరిజన కుటుంబాలకు నిత్యావసర సరుకులతో , చీరలు, సోలార్ విద్యుత్ లైట్లు, మహిళా అవసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన సహాయం అందించేందుకు పోలీస్ శాఖ తరఫున సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడుల్లా బయ్యారం సీఐ వి. వెంకటేశ్వరరావు, కరకగూడెం ఎస్సై పి.వి.ఎన్. రావు, రాబిన్ హుడ్ స్వచ్ఛంద సంస్థ సేవకులు భూసారపు రమేష్, పోలీస్ సిబ్బంది, సభ్యులు పాల్గొన్నారు.

## రమణమూర్తిపై దాడిని ఖండిస్తూ నిరసన

**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) జూలై 18 (పీపుల్స్ డైరీ) :** విజయ విహారం రమణమూర్తిపై జరిగిన దాడిని ఖండిస్తూ, నిందితుడు కశ్యప్ రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఇల్లందులో శాంతియుత నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, టెలివిజన్ చర్చా కార్యక్రమంలో పాల్గొంటున్న సమయంలో రమణమూర్తిపై దాడి జరగడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. అభిప్రాయాలను వ్యక్తీకరించే హక్కును హింసతో అణచివేయడం సమంజసం కాదని అన్నారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు. నిరసన కార్యక్రమంలో జై భారత్ బీసీ పోరాట వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెలిమిశెట్టి వీరన్న, మన్యం మోహన్‌రావు, టి. శ్రీనివాసరావు, ఎం. వసంతరావు, ఆవాజ్ నయీం బేగ్, ఆర్.బి. జై రాజు, ధనసరి రామ్మూర్తి, సుధీర్, సింగు నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, కౌసల్య, జి. వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయికి చేరిన గ్రామీణ ప్రతిభ..

### ఎన్ఐటి విద్యార్థిని సన్మానించిన కాలేజీ బృందం




**ఏన్కూరు, జూలై 18 (పీపుల్స్ డైరీ) :** ప్రభుత్వ కళాశాలలో చదివి జాతీయ స్థాయి ఇంజనీరింగ్ కాలేజీలో సీట్ సంపాదించి ప్రభుత్వ కళాశాలకు పేరు తెచ్చిన విద్యార్థిని శైలజను ఏన్కూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది ప్రిన్సిపాల్ సింహాచలం ఆధ్వర్యంలో శాలువా కప్పి శైలజ ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఏన్కూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ విద్యార్థి శైలజ 986 మార్కులు సాధించి కళాశాలకు పేరు తీసుకురావడం జరిగింది. అదేవిధంగా జాతీయస్థాయి ఇంజనీరింగ్ కాలేజీ అయినా ఎన్ఐటి వరంగల్ లో సీటు సంపాదించి తన నైపుణ్యతను ప్రదర్శించింది. వైరా సమీపంలోని రెబ్బవరం గ్రామానికి చెందిన శైలజ ఏన్కూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసించి కార్పొరేట్ స్థాయి విద్యను అధిగమించి అత్యధిక మార్కులు సంపాదించడం కళాశాల గర్వకారణమని కళాశాల ప్రిన్సిపాల్ సింహాచలం విద్యార్థిని శైలజను అభినందించారు. ప్రభుత్వ కళాశాలలో కూడా నాణ్యమైన విద్య అందుతుందనే నమ్మకాన్ని పలువురికి కలగజేసే విధంగా విద్యార్థిని శైలజ అత్యధిక మార్కులు సాధించి ఎన్ఐటి వరంగల్‌లో సీట్ సంపాదించడం కళాశాలకే గర్వకారణం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.





# మెట్ట పంటల వైపు రైతులు దృష్టి సారించాలి

### కూసుమంచి మండల పర్యటనలో తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**ఖమ్మం, జూలై 18 (పీపుల్స్ డైరీ) :** ఎల్ నినో ప్రభావం వల్ల ఈ ఏడాది వర్షాలు తక్కువగా నమోదవుతాయని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని, ఈ పరిస్థితుల్లో రైతాంగం సాంప్రదాయ సాగు మొండిపట్టు వీడి, మారుతున్న ప్రకృతి సవాళ్లకు అనుగుణంగా అప్రమత్తం కావాలని, అధిక నీటి వినియోగం ఉండే పంటల జోలికి వెళ్లకుండా, తక్కువ నీటి అవసరాలతో చేతికొచ్చే ప్రత్యామ్నాయ మెట్ట పంటల వైపే దృష్టి సారించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం పాలేరు నియోజకవర్గ పరిధిలోని కూసుమంచి మండలంలో మంత్రి, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తో కలిసి విస్తృతంగా పర్యటించారు. మండల పర్యటనలో భాగంగా మంత్రి, పలు చోట్ల శంకుస్థాపనలు చేశారు. మల్లాయిగూడెంలో రూ. 2.52 కోట్లతో పెరికసింగారం ఎన్ఎస్పీ కెనాల్ నుంచి భగవాన్ తండా మీదుగా మల్లాయిగూడెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, రూ. 20 లక్షలతో నిర్మించే గ్రామ పంచాయతీ కార్యాలయ భవనానికి భూమిపూజ చేశారు. అనంతరం కోక్యా తండాలో రూ. 1.69 కోట్లతో లింగారం తండా నుంచి లోక్యా తండా ఎన్ఎస్పీ కాలువ వరకు నిర్మించే బీటీ రోడ్డు పనులకు, అగ్రహారంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న పంచాయతీ భవనానికి శంకుస్థాపనలు చేశారు. అనంతరం కూసుమంచిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు మంత్రి చేతుల మీదుగా సంక్షేమ చెక్కుల పంపిణీ జరిగింది. మండల వ్యాప్తంగా 66 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అదేవిధంగా వివిధ అనారోగ్య కారణాలతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న 111 మంది బాధితులకు రూ. 35.16 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాలను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ... ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతుల పక్షపాతి అని, ఇప్పటికే 'రైతు భరోసా' అందించి అన్నదాతలకు అండగా నిలిచామని స్పష్టం చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా శాస్త్రవేత్తల సూచనలను పాటిస్తూ సాగు విధానాల్లో మార్పులు చేసుకోవడం అత్యంత ఆవశ్యకమని అన్నారు. ప్రజాప్రభుత్వం పేదవారికి అండగా పనిచేస్తున్నదని మంత్రి తెలిపారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డుల జారీ చేశామన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ళు ఇచ్చామని, రెండో విడత ఇందిరమ్మ ఇళ్ళు త్వరలో ఇస్తామని, మూడో, నాలుగో విడతల ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తామని, అర్హులైన ప్రతిఒక్క కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ళు వస్తాయని మంత్రి అన్నారు. రైతు భరోసా ఎకరాకు 6 వేలు రైతుల ఖాతాల్లో జమచేశామన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజలకు కావాల్సిన అన్ని మౌళిక వసతుల కల్పన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, హౌజింగ్ పిడి శ్రీనివాస్, కూసుమంచి మండల తహసీల్దార్ సైదులు, ఎంపిడివో సిలార్ సాహెబ్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులున్నారు.

## వర్షాలు లేక ఆందోళనలో రైతులు

### వరుణుడి కరుణ కోసం ఎదురు చూపులు...అక్కడక్కడ చిరు జల్లులు





**ఏన్కూరు, జూలై 18 (పీపుల్స్ డైరీ) :** ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. రైతులు సాగు చేసిన పంటలు ఎండి పోతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరుణుడి కరుణ కోసం ఎదురు చూస్తున్నారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. ఏనుకూరు మండలంలో 14,350 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. 435 ఎకరాల్లో వరి విత్తనాలు చల్లారు. 720 ఎకరాల్లో పెసర సాగుచేశారు. వరి, మిర్చి నార్లను పోసి ఉంచారు. వర్షాకాల ప్రారంభంలో ఓ మోస్తరు వర్షాలు కురిసినప్పటికీ గత 20 రోజుల నుంచి వర్షాలు ముఖం చాటేయడంతో సాగు చేసిన పత్తి ఎండిపోతున్నది. పంటలను రక్షించుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. గత రెండు, మూడు రోజుల నుంచి మబ్బులు పడుతున్నప్పటికీ వర్షాలు కురవకపోవటంతో రైతులు నిరాశ చెందుతున్నారు. నిత్యం వర్షాల కోసం ఆకాశం వైపు రైతులు ఎదురు చూస్తున్నారు.వర్షాల కోసం పూజలు చేస్తున్నారు. ఇది ఇలా ఉంటే రైతులు వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు ప్రచారం చేస్తున్నారు. వరి సాగు చేసే రైతులు దీర్ఘకాలిక రకాలు కాకుండా స్వల్పకాలిక రకాలు సాగుచేసుకోవాలని, వర్షాలు లేనందున గతంలో మాదిరి కాకుండా తక్కువ విస్తీర్ణంలో వరి, మిర్చి సాగు చేసుకోవాలని ఆరుతడి పంటలైన పెసర, మినుము, జొన్నలు, నువ్వులు సాగుచేసుకోవాలని ప్రచారం చేస్తున్నారు.శనివారం సాయంత్రం మండలంలో అక్కడక్కడ ఒక మోస్తరు వాన కురిసింది.

## తెలంగాణ ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా మల్లేష్







**ఖమ్మం, జులై 18 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ ఆటో, ప్రైవేట్ మోటర్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్, డ్రైవర్స్ యూనియన్ (ఏఐటియుసి అనుబంధం) ఖమ్మం జిల్లా గౌరవ అధ్యక్షుడిగా పగడాల మల్లేష్, జిల్లా ఉపాధ్యక్షుడిగా బుడిగ వెంకట్రావు(సాంబ)లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఖమ్మం యం.బి గార్డెన్ లో జరిగిన జిల్లా మహాసభలో వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పగడాల మల్లేష్ మాట్లాడుతూ... ఆటో వర్కర్స్, ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ కార్మికులను ప్రభుత్వాలు కనీస భద్రత కల్పించడం లేదని, భవిష్యత్ లో సమస్యల పరిష్కారానికై సమరశీల పోరాటాలను నిర్వహిస్తాం అన్ని ఆయన పిలుపునిచ్చారు.

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

### పాలేరు నియోజకవర్గ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ఖమ్మం, జూలై 18 (పీపుల్స్ డైరీ) :** పాలేరు నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని, ప్రజలకు వీటి ఫలాలు త్వరితగతిన అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. కూసుమంచి క్యాంపు కార్యాలయంలో శనివారం పాలేరు నియోజకవర్గ అభివృద్ధి పురోగతిపై ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి మంత్రి, వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి, నియోజకవర్గంలో జరుగుతున్న వివిధ నిర్మాణ, మౌళిక వసతుల పనులను ఇంజనీరింగ్ శాఖల వారీగా సమీక్షించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు ఎన్ని పనులు మంజూరయినది, వాటిలో ఎన్ని పనులకు టెండర్ ప్రక్రియ పూర్తయి పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఎన్ని పనులు పురోగతిలో ఉన్నాయి, సాంకేతిక లేదా ఇతర కారణాల వల్ల ఇంకా టెండర్ కాని పనులు ఎన్ని ఉన్నాయి అనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. టెండర్లు నిలిచిపోయిన పనులకు అడ్డంకులను తొలగించి వెంటనే ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి మాట్లాడుతూ... అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి అయ్యేలా అధికారులు కార్యాచరణ చేయాలన్నారు. అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీ లేదన్నారు. నిర్దేశిత గడువు లోపల పనులన్నింటినీ పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. పెండింగ్ బిల్లుల వివరాలు సమర్పించాలని మంత్రి తెలిపారు. అభివృద్ధి పనులు వేగంగా సాగాలంటే వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం చాలా ముఖ్యమని మంత్రి అన్నారు. అధికారులు ఒకరితో ఒకరు చర్చించుకుంటూ, ఎక్కడైనా సమస్యలు ఎదురైతే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పనులకు ఆటంకం కలగకుండా చూడాలన్నారు. ప్రజాదర్బార్ సందర్భంగా స్వీకరించిన దరఖాస్తులు పరిష్కరించాలన్నారు. శాఖల వారీగా ఎన్ని దరఖాస్తులు వచ్చింది, ఎన్ని పరిష్కారం అయింది, ఇంకనూ ఎన్ని పెండింగ్ లో ఉన్నది అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల పరిష్కారానికి నిధులు ప్రభుత్వం మంజూరు చేస్తుందని మంత్రి తెలిపారు. పాలేరు నియోజకవర్గంలో పూర్తిగా రీ సర్వే ప్రక్రియకు చర్యలు తీసుకోవాలని అన్నారు. పాలేరు నియోజకవర్గం రాష్ట్రానికి ఆదర్శంగా రూపుదిద్దుకోవాలని మంత్రి అన్నారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి, ఖమ్మం ఆర్డీవో ఎన్.శ్రీనివాస్, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాస చారి, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, నియోజకవర్గ ఎంపీడీవోలు, తహశీల్దార్లు, అధికారులు, తదితరులున్నారు.





EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT RATNA GRAPHICS, 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPP : POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013, PUBLISHED AT H.NO. 3-4-396, NEW RAYAPURA, HANAMKONDA, WARANGAL, TELANGANA - 506001.
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com